శుక్రవారం
27-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 126
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

బడికిరాని పిల్లలపై చర్యలు

పాట్నా: ప్రభుత్వ పాఠశాలలకు గైర్హాజరయ్యే విద్యార్థులపై బీహార్ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా ఎక్కువ రోజులు తరగతులకు హాజరుకాని విద్యార్థుల పేర్లను పాఠశాలల జాబితా నుంచి తొలగించింది. దాదాపు 20 లక్షలకు పైగా విద్యార్థుల పేర్లను తొలగించడం చర్చనీయాంశంగా మారింది. 10, 12వ తరగతుల బోర్డు పరీక్షలకు హాజరు కావాల్సిన సుమారు 2.66లక్షల మంది విద్యార్థులూ ఈ జాబితాలో ఉండటం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును మెరుగుపరిచే ఉద్దేశంతో సెప్టెంబర్ 1 నుంచి బీహార్ విద్యాశాఖ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా 15 రోజులు వరుసగా పాఠశాలలకు దుమ్మా కొట్టే విద్యార్థుల పేర్లను తొలగించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

కారు-లారీ ఢీకొన్న ఘటనలో 13 మంది దుర్మరణం

మృతులందరూ సత్య సాయి జిల్లా వాసులే

విశాలాంధ్ర-గోరంట్ల/ విశాలాంధ్ర బ్యూరో-శ్రీసత్యసాయి: స్వగ్రామంలో ఉపాధి లేక పొరుగు రాష్ట్రానికి ఉపాధి కోసం వలస వెళుతున్న కూలీలు రోడ్డు ప్రమాదానికి గురై మృత్యు ఒడికి చేరుకున్నారు. పండుగ కోసం స్వగ్రామాలకు వచ్చి అప్పటివరకు అందరితో కలిసి సంతోషంగా గడిపారు. పొట్టకూటి కోసం తెల్లవారుజామునే బయల్దేరి వెళ్తుండగా అనుకోని ఘటన ఎదురైంది. మరో గంటలో బెంగళూరుకి చేరుకుంటామనే సమయంలో పొగ మంచు వారి పాలిట మృత్యువుగా మారింది. కర్నాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది శ్రీ సత్య సాయి జిల్లా వాసులు దుర్మరణం చెందారు. గురువారం ఉదయం చిక్‌బళ్లాపూర్ దగ్గర బెంగళూరు

- మిగతా 2 లో

ఎన్సీఈఆర్టీ ప్రతిపాదనపై నిరసన వెల్లువ 2లో

భారత నేవీ మాజీ అధికారులు

8 మందికి మరణశిక్ష

- గూఢచర్యం కేసులో ఖతార్ కోర్టు తీర్పు
- న్యాయపోరాటం చేస్తాం: భారత విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: భారత నౌకాదళ మాజీ అధికారులు ఎనిమిది మందికి గూఢచర్యం కేసులో ఖతార్ కోర్టు మరణశిక్ష విధించింది. కొన్ని నెలలుగా ఆ దేశ నిర్బంధంలో ఉన్న వీరి కేసు విచారణకు రాగా కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు వార్తాలొచ్చాయి. దీనిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన భారత విదేశాంగశాఖ... న్యాయ పోరాటం చేస్తామని తెలిపింది. ఈ తీర్పుపై పూర్తి సమా చారాన్ని సేకరిస్తున్నట్లు వెల్లడించింది. శిక్ష పడిన ఎనిమిది మంది కుటుంబ సభ్యులతో, న్యాయ బృందంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొంది. వారికి మరణశిక్ష తప్పించేందుకు చట్టపరంగా ఉన్న అన్ని అవకాశాల కోసం అన్వేషి స్తున్నామని తెలిపింది. ఈ కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామని వెల్లడించింది. ఈ తీర్పునకు సంబంధించిన విషయాన్ని ఖతార్ అధికారుల

- మిగతా 2 లో

ఇళ్ల కోసం కళ్లు కాయలు

- జగనన్న కాలనీల్లో ముందుకు సాగని పనులు
- కనీస వసతులూ కరువే
- అయోమయంలో లబ్ధిదారులు
- ఇళ్ల స్థలాల కోసం వెతుకులాట
- పట్టాలకే పథకం పరిమితమా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న కాలనీల్లో ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు పూర్తి చేసి ఇస్తుందన్న ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. తమ ప్రభుత్వం ఇళ్లను కాదు, ఊళ్లను నిర్మిస్తోందంటూ సీఎం వైఎస్ జగన్ ప్రతి సభలోనూ ప్రకటిస్తుంటారు. అదే తరహాగా మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు జగనన్న కాలనీలపై పదే పదే గొప్పలు చెబుతున్నప్పటికీ... ఆ దిశగా పనులు కొనసాగడం లేదు. జగనన్న ఇళ్ల పథకంలో భాగంగా మహిళా లబ్ధిదారులకు ఇప్పటికే పట్టాలు అందజేశారు. లక్షలాది మందికి పట్టాలిచ్చి, ఇళ్ల నిర్మాణంపై మాత్రం ప్రభుత్వం మౌనం వహిస్తోందనే ప్రచారముంది. దీంతో తమ ఇళ్ల నిర్మాణం గురించి సమాచారం తెలియక లబ్ధిదారులు సతమతమవుతున్నారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులను జగనన్న కాలనీ ఇళ్లకు ఎంపిక చేసింది. దశల వారీగా ఇళ్లను నిర్మించడంతో, ఆయా కాలనీల్లోని కొన్ని ఇళ్లు పూర్తయ్యే దశలో ఉండగా, మరికొన్ని ఇళ్ల పనులు ప్రారంభించలేదు. పట్టణాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలాలను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేసి, వారికి పట్టాలను అందజేశారు. మొదట్లో ఈ పథకం కింద పట్టాలు పొందిన లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేశారు. వారిలో చాలామందికి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో అసంతృప్తి చెందుతున్నారు. తమకు కేటాయించిన ఇంటి స్థలం ఎక్కడ ఉందనేదీ లబ్ధిదారులకు అంతు పట్టడం లేదు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంతవరకు చూపలేదని పేర్కొంటున్నారు. ఈ ఇళ్లను విడతల వారీగా నిర్మించడంతోనే ఈ గందరగోళం నెలకొంది. మరో నాలుగైదు నెలల్లో ఎన్నికల రానుండటంతో ఈ ప్రభుత్వ ఉండగానే తమ ఇళ్లు పూర్తవుతాయా? లేదా? అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పునాదుల్లోనే ఇళ్లు !

జగనన్న కాలనీలో భాగంగా నిర్మించిన ఇళ్లు చాలా వరకు పునాదుల్లోనే దర్శనమిస్తున్నాయి. చేపట్టిన ఇళ్ల పనుల్లోనూ నాణ్యత లోపం కనిపిస్తోంది. అత్యధికంగా కొండ, లోతట్టు ప్రాంతాల్లో లే అవుట్లు ఉన్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా అక్కడ నీరు నిలుస్తోంది. దీనివల్ల ఇళ్ల నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతోంది. పూర్తయిన ఇళ్లకు విద్యుత్, వాటర్ పైపు లైన్

- మిగతా 2 లో

గాజాలో శాంతి నెలకొల్పాలి

మోదీ సర్కారు తీరు మారాలి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గం తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పలస్తీనీయన్లపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని, గాజాలో శాంతి నెలకొల్పేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గం కోరింది. విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం జరిగిన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, పి.హరనాథరెడ్డి, జి. ఈశ్వరయ్య, అక్కినేని వనజ, కేవీవీ ప్రసాద్, పి.రామచంద్రయ్య, జంగాల అజయ్‌కుమార్, డేగా ప్రభాకర్ పాల్గొన్నారు.

తీర్మాన సారాంశమిదే:

అమెరికా వత్తాసుతో గాజాపై ఇజ్రాయిల్ ఎడతెరపిలేని బాంబుల వర్షాన్ని కురిపిస్తున్నది. ఈనెల 7న ఇజ్రాయిల్‌పై హమాస్ జరిపిన దాడులలో 1400 మంది చనిపోయారు. దీనికి ప్రతీకారంగా పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ విరుచుకుపడింది. ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో మరణించిన వారి పలస్తీనీయన్ల సంఖ్య 7వేలకు చేరుకుంది. ఇందులో సుమారు మూడు వేల మందికిపైగా చిన్నారులు ఉన్నారు. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ఇజ్రాయిల్ ఒక తోలుబొమ్మ రాజ్యంగా ఉంది. 1947, నవంబరు 29 నుంచి ఇజ్రాయిల్ నిర్మాణానికి పలస్తీనా భూభాగంలో 181వ తీర్మానం ద్వారా ఐక్యరాజ్యసమితి ఆమోదించింది. అరబ్ దేశాలు, పలస్తీనా అంగీకరించాయి. తన భూభాగంలో యూదులతో కలిసి జీవించడానికి పలస్తీనా ఒప్పుకుంది. దీంతో 1948, మే 15న ఇజ్రాయిల్ ఏర్పడింది. అయితే మరసటి రోజున పలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ యుద్ధం చేసింది. 22శాతం భూభాగాన్ని గాజా, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాలకు పలస్తీనా ప్రజలను పరిమితం చేసింది. సుమారు ఎనిమిది లక్షల మంది పలస్తీనీయన్లను పారదోలింది. వేలాది మందిని చంపింది. గాజా, వెస్ట్‌బ్యాంకులను బహిరంగ జైళ్లుగా మార్చింది. 1967 జూన్‌లో జరిగిన ఆరు రోజుల యుద్ధంతో క్రైస్తవ, ముస్లిం, యూదుల పవిత్ర నగరం జెరూసలేంను ఇజ్రాయిల్ ఆక్రమించింది. అల్-అక్సా మసీదుపై అజమాయిషీ తీసుకుంది. అప్పటి నుంచి

- మిగతా 2 లో

ఎన్నికల వేళ ఈడీ పంజా

- రాజస్తాన్ సీఎం తనయుడికి సమన్లు
- నేడు విచారణకు రావాలని వైభవ్‌కు ఆదేశాలు
- పేపర్ లీక్ కేసులో కాంగ్రెస్ అభ్యర్థుల ఇళ్లు, ఆస్తుల సోదా

జైపూర్: త్వరలో ఎన్నికలు జరగబోయే రాజస్తాన్‌లో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త తలనొప్పి మొదలైంది. పరీక్షాపత్రం లీక్ వ్యవహారంలో మనీలాండరింగ్ కేసులో అధికార కాంగ్రెస్ పార్టీ నేతల ఇళ్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సోదా చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతస్రాకు చెందిన జైపూర్, సికర్ ఆస్తులను ఈడీ అధికారులు తనిఖీ చేశారు. దోతస్రా (59) స్కూలు విద్యాశాఖ మాజీ మంత్రి. అలాగే దౌసాలో మహువా స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేయబోయే ఓంప్రకాశ్ హుడ్లాతో పాటు ఇంకొందరు అభ్యర్థుల నివాసాల్లోనూ ఈడీ దాడులు జరిగాయి. అదే విధంగా ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ కుమారుడు వైభవ్‌కు ఫెమా కేసులో ఈడీ సమన్లు జారీ అయ్యాయి. ఫెమా నిబంధనల ఉల్లంఘనల కేసులో తాజా సమన్లు జారీ చేసినట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. శుక్రవారం న్యూఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని వైభవ్‌కు ఆదేశాలిచ్చినట్లు పేర్కొంది. ఈడీ ప్రశ్నలను ఎదుర్కొనే ముందు 2011 నుంచి ఇప్పటివరకు పత్రాలను పరిశీలించాల్సి ఉన్నందున విచారణ కోసం మరొక తేదీని వైభవ్ కోరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పీఎంఎల్ఏలా కాకుండా ఫెమాది సివిల్ కేసన్నారు. రాజస్తాన్‌లోని ట్రైటన్ హోటల్స్ & రిసార్ట్స్ ప్రై.లి., వార్ధ ఎంటర్‌ప్రైజెస్ ప్రై.లి., వాటి డైరెక్టర్లు, ప్రమోటర్లు శివశంకర్ శర్మ, రతన్ కాంత్ శర్మ తదితరులపై ఇటీవల జరిగిన ఈడీ దాడులతో సమన్లు ముడిపడి ఉన్నాయి. వైభవ్ గెహ్లాత్‌తో రతన్ కాంత్ శర్మకు సంబంధాలను ఈడీ పరిశీలిస్తోంది. ఈ దాడుల్లో రూ.1.2కోట్ల నగదును ఈడీ సీజ్ చేసింది. శర్మ, వైభవ్

- మిగతా 2 లో

ఎండిన పంటలు...

కరువు కోరల్లో రైతన్న

- ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి
- పనులు కల్పించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర - రెడ్డిగూడెం: రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర అనావృష్టి ప్రభావం వల్ల సాగునీరు, తాగునీరు లేక మెట్టపైర్లన్ని ఎండిపోయి రైతులు, కూలీలు తీవ్ర కరువు కోరల్లోచిక్కుకొని విలవిల్లాడిపోతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆకలిచావుల బారిన పడకముందే తగు సహాయ చర్యలు చేపట్టి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎండిపోయిన పైర్ల పరిశీలనలో భాగంగా కోటేశ్వరరావు గురువారం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండల పరిధిలోని వరి, మిర్చి, పత్తి, మినుము తదితర పంట పొలాలో ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో విలేకర్లతో మాట్లాడుతూ, పంట

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చంద్రబాబుకి ఆరోగ్య సమస్యలు

- బెయిల్ పిటిషన్‌పై తక్షణమే విచారణ జరపండి
- హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆయన తరపు న్యాయవాదులు గురువారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. మూడు నెలల క్రితం చంద్రబాబు ఎడమ కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ జరిగిందని పేర్కొన్నారు. ఇప్పుడు కుడి కంటికి ఆపరేషన్ జరపాల్సి ఉందని పిటిషన్‌లో వివరించారు.జైలు అధికారులు కుటుంబసభ్యులకు అందించిన వైద్య నివేదిక ప్రకారం చంద్రబాబు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. స్కిన్ అలర్జీతోపాటు శరీరంపై దద్దుర్లు వ్యాపించి నొప్పి, ఇతరత్రా సమస్యలు వచ్చాయి. ఏసీ పెట్టినప్పటికీ దద్దుర్ల సమస్య తగ్గలేదు. వెన్ను కింది భాగంలో నొప్పిగా ఉందని, కూర్చున్నప్పుడు ఇబ్బందిపడుతున్నట్లు గుర్తించారు. దీనిపై చంద్రబాబు కుటుంబసభ్యులు వారి కుటుంబ వైద్యులను సంప్రదిస్తే విరోచనం సాఫీగా కాకపోవడం, నడుం కింది భాగంలో నొప్పి ఉండటం వంటివి లోపల ఏదో సమస్య ఏర్పడుతుందని సూచిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ప్రాక్టోస్కోపీ వంటి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తేనే అసలు సమస్య తెలుస్తుందని, అలాగే వదిలేస్తే ఫిషర్ లాంటి సమస్యకు దారితీసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయవాదులు చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు.

భూతల లక్షితదాడులు

- గాజాలోకి యుద్ధ ట్యాంకులు
- హమాస్ స్థావరాలపైనే ఇజ్రాయిల్ గురి
- ఐడీఎఫ్ ప్రకటన - వీడియో విడుదల

2లో

అమెరికాలో మళ్లీ కాల్పులు

- 22 మంది దుర్మరణం
- 60 మందికి గాయాలు
- మైనే రాష్ట్రంలో రెండు ఘటనలు
- దుండుగుడు మాజీ సైనికుడు
- గాలిస్తున్న పోలీసులు
- గడప దాటొద్దని ప్రజలకు హెచ్చరికలు

2లో

అమెరికాలో మళ్లీ కాల్పులు

లూయిస్టన్: అమెరికాలో మరోమారు కాల్పుల ఘటన కలకలం రేపింది. దుండగుడు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 22 మంది ప్రాణాలు కోల్పోగా 60 మందికిపైగా గాయపడ్డారు. మైనే రాష్ట్రంలోని లూయిస్టన్ నగరంలోని బార్ బౌలింగ్ అల్లేతో పాటు వాల్‌మార్ట్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో కాల్పులు చోటు చేసుకున్నాయి. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు నగర కౌన్సిలర్ రాబర్ట్ మెక్‌కార్తీ సీఎన్ఎన్‌కు తెలిపారు. ఈ ఘటనలపై మైనే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దుండగుడిని రాబర్ట్‌కార్డ్‌గా గుర్తించారు. సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో ఉన్న అతని ఫొటోలు విడుదల చేశారు. 40 ఏళ్ల రాబర్ట్... మైనేలోని యూఎస్ ఆర్మీ రిజర్వ్ ట్రెనింగ్ సెంటర్‌లో ఫైర్ ఆర్మ్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందినట్లు పోలీసులు వెల్లడించారు. గతంలో గృహ హింస కేసులో అరెస్టుకు గురైనట్లు గుర్తించారు. ఈమధ్యనే మానసిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందినట్లు కూడా పోలీసులు తెలుసుకున్నారు. అనుమానితుడిని చాలా ప్రమాదకర వ్యక్తిగా మైనే పోలీసులు సోషల్ మీడియాలో వెల్లడించారు. జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. గడప దాటవద్దని, ముమ్మర గాలింపులు, దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. నిందితుడు నల్ల రంగు వాహనం కోసం వెతుకుతున్నామని, అతని ఆచూకి తెలిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అమెరికాలో ఈ ఏడాది జరిగిన సామూహిక కాల్పుల ఘటనల్లో ఇదే ఘోరమైనదిగా అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 500 మందికిపైగా సామూహిక కాల్పుల్లో మరణించారు.

మైనేకు అండగా నిలుస్తాం: బైడెన్

లూయిస్టన్ ఘటన గురించి తెలుసుకున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెంటనే మైనే గవర్నర్, ఇద్దరు సెనేటర్లు, స్థానిక కాంగ్రెస్ సభ్యుడికి ఫోన్లు చేసి ఆరా తీశారు. ఈ భయానక ఘటన క్రమంలో అవసరమైన సహాయక సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు శ్వేతసౌధ్యం ప్రకటించింది. ఈ ఘటనలు చాలా బాధాకరమని మైనే సెనేటర్ ఆగస్ కింగ్ వ్యాఖ్యానించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మైనే కాంగ్రెస్‌మెన్ జారెడ్ గోల్డెన్ కూడా ఎక్స్ మాధ్యమంగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ఇది నా స్వస్థలం. ఇక్కడ ఇంతటి ఘోరం జరగడం కలచివేసింద'ని ఆయన ట్వీట్ చేశారు.

ఎండిన పంటలు...కరువు కోరల్లో రైతన్న

(మొదటిపేజీ తరువాయి)

చేతికందే దశలో అనావృష్టి కాటేసిందని, దీనితో చిన్న, సన్నకారు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు, చేతి వృత్తిదారులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.. వరికి ఎకరానికి సుమారుగా రూ. 40వేలు, పచ్చిమిర్చికి ఎకరాకు రూ. 50వేలు, పత్తికి ఎకరాకు రూ. 60వేలు, మినుము ఎకరాకు రూ. 30వేలు పెట్టుబడులు పెట్టి శ్రమిస్తే తీరా పంట చేతికందే దశలో వర్షాభావ విపత్తు తమను నిలువునా ముంచిందని బాధిత రైతులు కోటేశ్వరరావు వద్ద బోరుమన్నారు. వేలాది రూపాలయలు ఖర్చు పెట్టి వేసినపైర్లను పశువులుమేస్తున్న దృశ్యాలు చూస్తుంటే హృదయ విధారకరంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు జీవనం కోసం వలసబాటతప్పడం లేదని కోటేశ్వరరావు వివరించారు. రోజుకు రూ. 600 కూలీ గిట్టే విధంగా ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలనీ విధిగా 200 రోజుల పనిదినాలు కల్పించాలనీ, ప్రతి కుటుంబానికి నెలకు 10 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేయాలనీ, వలసలను నివారించాలని, పంట నష్టపోయిన రైతాంగానికి పూర్తి నష్టపరిహారం చెల్లిస్తూ మరలా పంట వేసుకోవటానికి ఆర్థిక సహకారం అందించాలని ప్రభుత్వానికి సీహెచ్ కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో స్థానిక సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పోతురాజు సాంబయ్య, కృష్ణ, చల్లా దాసు, వెంపటి యేసు, తదితరులు పాల్గొన్నారు.

గాజాలో శాంతి నెలకొల్పాలి

(మొదటిపేజీ తరువాయి)

పలస్తీనీయన్లపై తరచూ దాడుల జరుగుతూనే ఉన్నాయి. దీంతో వారి ఉనికి ప్రశార్థకమైంది. 1993లో జరిగిన ఓస్లో శాంతి ఒడంబడిక ప్రకారం రెండు దేశాలు ఏర్పడతాయి. తూర్పు జెరూసలేం... పలస్తీనా రాజధాని కావాలి కానీ ఒడంబడికను ఇజ్రాయిల్ అమలు చేయలేదు. పలస్తీనా భూభాగాల్లో ఐక్యరాజ్యసమితి తీర్మానానికి వ్యతిరేకంగా అక్రమ కట్టడాలు, కాలనీలు 150 వరకూ వెలిశాయి. ఇప్పటివరకు 84సార్లు వీటోను ఐరాసలో అమెరికా ఉపయోగిస్తే దానిలో 44సార్లు ఇజ్రాయిల్ కోసం వాడింది. తాజాగా గాజాలో కాల్పుల విరమణ తీర్మానాన్ని భద్రతా మండలిలో వ్యతిరేకించింది. మొత్తం పలస్తీనా జాతిని నిర్మూలించడానికి అమెరికా దన్నుతో ఇజ్రాయిల్ విజృంభిస్తోంది. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్‌తో పాటు చైనా కూడా ఇజ్రాయిల్ దాడులను ఆత్మరక్షణ హక్కుగా గుర్తిస్తున్నాయి. హమాస్ దాడుల కారణంగా ఇజ్రాయిల్ ప్రతిదాడులు చేయవలసి వస్తున్నదంటున్నాయి. ఒక్క పశ్చిమ దేశం కూడా కాల్పుల విరమణ గురించి మాట్లాడడం లేదు. దీనికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందితో పలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు జరుగుతున్నాయి. భారతదేశ వైఖరి ప్రారంభం నుంచి పలస్తీనాకు అనుకూలం. అయితే మోదీ సర్కారు పరోక్షంగా విదేశాంగ విధానాన్ని మార్చుతూ ఇజ్రాయిల్ వైపు చేరటానికి ప్రయత్నిస్తున్నది. ఇది సమంజసం కాదు. 'పలస్తీనీయన్లపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయాలి. పలస్తీనాలో శాంతి నెలకొల్పాలి' అని సీపీఐ తీర్మానం చేసింది.

8 మందికి మరణశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్తామని విదేశాంగ శాఖ పేర్కొంది. గోప్యతకు సంబంధించిన కారణాల దృష్ట్యా ఈ కేసుపై ఎక్కువగా మాట్లాడలేమని తెలిపింది.

ఏం జరిగిందంటే...

భారత్‌కు చెందిన ఎనిమిది మంది నౌకాదళ మాజీ అధికారులు అల్ దహ్రా సంస్థలో పని చేస్తున్నారు. ఖతార్ సాయుధ దళాలకు శిక్షణ, ఇతర సేవలందించే ఈ సంస్థను ఒమన్‌కు చెందిన వైమానిక దళం మాజీ అధికారి నిర్వహిస్తున్నారు. భారత్‌కు చెందిన ఎనిమిది మందిని ఖతార్ అధికారులు 2022 ఆగస్టులో నిర్బంధంలోకి తీసుకున్నారు. సబ్‌మెరైన్ కార్యక్రమాల్లో గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలతో వీరిని నిర్బంధించినట్లు తెలిసింది. వీరంతా భారత అధికారులతో మాట్లాడేందుకు ఖతార్ అనుమతి ఇచ్చింది. దీంతో భారత విదేశాంగ శాఖ అధికారులు కలవడంతోపాటు ఖతార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. అనేకమార్లు బెయిల్‌కు యత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. వీరి నిర్బంధాన్ని ఖతార్ ప్రభుత్వం పొడిగించింది. చివరకు ఈ కేసు కోర్టులో విచారణకు వెళ్లింది. దీంతో ఎనిమిది మందికి మరణ శిక్ష విధిస్తూ అక్కడి న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

ఇజ్రాయిల్ దాడుల్లో

అల్ జజీరా జర్నలిస్ట్ కుటుంబం మృతి

జెరూసలేం: హమాస్‌పై ప్రతీకారంతో గాజాపై దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయిల్ సేఫ్‌జోన్లనూ వదలడంలేదు. అక్కడా బాంబులు కురిపించింది. విచక్షణ కోల్పోయి దాడులకు తెగబడుతోందని అల్ జజీరా ఆక్షేపించింది. తమ వార్తా సంస్థ గాజా బ్యూరో చీఫ్ వయిల్ అల్ దాహ్‌దౌ తన కుటుంబాన్ని ఇజ్రాయిల్ దాడుల్లో కోల్పోయినట్లు తెలిపింది. పాత్రికేయుడి భార్య, కుమారుడు, కుమార్తె, మనవడు వైమానిక దాడుల్లో మృతి చెందినట్లు అల్ జజీరా మీడియా నెట్వర్క్ వెల్లడించింది. సంబంధించిన దృశ్యాలు ప్రసారం చేసింది. ఇజ్రాయిల్ దాడులను అమానవీయమైనవిగా పేర్కొంది. దక్షిణ గాజాకు తరలిపోమని గాజా ప్రజలకు ఇజ్రాయిల్ సూచించిన క్రమంలో అక్కడి నుస్రత్ క్యాంపులో పాత్రికేయుడి కుటుంబం ఆశ్రయం పొందింది. కానీ వైమానిక దాడులకు ఇజ్రాయిల్ తెబడటంతో దాహ్‌దౌ కుటుంబంలో నలుగురు

మృత్యువాత పడ్డారు. ఈ ఘటనతో గాజాలోని తమ తోటి వారి భద్రతపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తూ అల్ జజీరా ఓ ప్రకటన వెలువరించింది. పాత్రికేయులు, వారి కుటుంబాల రక్షణ బాధ్యత ఇజ్రాయిల్‌దేనని అందులో పేర్కొంది. 'దాహ్‌దౌ బుధవారం గాజా నగరం నుంచి రిపోర్టింగ్ చేస్తున్న సమయంలో లైవ్‌లోనే తన కుటుంబం గురించి దుర్వార్త ఆయనకు అందింది' అని అల్ జజీరా ఎడిటర్ మహమ్మద్ మోవద్ పేర్కొన్నారు. దాహ్‌దౌ మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కన్నీళ్లతో మాట్లాడుతూ గాజాలో ఎవరూ సురక్షితం కాదన్నారు. 'ఇక్కడ బాంబుల వర్షం కురుస్తోంది. మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతారు. ఈ విషాదం ఏ విపత్తుకు తీసిపోదు' అని అన్నారు. అల్ అక్సా ఆసుపత్రిలో తనవారి మృతదేహాలను చూసి రోదించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, దృశ్యాలను అల్‌జజీరా ట్వీట్ చేసింది. ఇజ్రాయిల్ ఈ మరణాలను ధ్రువీకరించలేదు.

ప్రాణభయంతోనే విధులు: జర్నలిస్టుల రక్షణ కమిటీ

ఇజ్రాయిల్ ఏకపక్ష దాడుల్లో ఇప్పటికే 20 మంది పలస్తీనా పాత్రికేయులు సహా 24 మంది జర్నలిస్టులు చనిపోయారని 'ది కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్' పేర్కొంది. తాజాగా మరో జర్నలిస్టు తన కుటుంబాన్ని కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘటనలు పాత్రికేయులను కలచి వేస్తున్నాయని, వారిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంది. గాజాలో వార్తాసేకరణ విధులలో ఉన్న పాత్రికేయులు ప్రాణభయంతోనే పని చేస్తున్నారని అంతర్జాతీయ మీడియా కూడా చెబుతోంది. ఆసుపత్రి జనరేటర్లతో తమ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు ఛార్జింగ్ చేసుకుంటున్నారని, ఆ ప్రాంగణంలో టెంట్లు వేసుకొని పగలు న్యూస్‌రూమ్‌లుగా, రాత్రిళ్లు డార్మెటరీలుగా వాడుకుంటున్నారని తెలిపింది. మహిళా పాత్రికేయుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఆసుపత్రి బయట ఆగివున్న కార్లలో వారు రాత్రిళ్లు గడుపుతున్నారు. కనీస సదుపాయాలు లేక మంచినీరు తాగేందుకూ భయపడుతున్నారని ఓ మీడియా సంస్థకు చెందిన జర్నలిస్ట్ విస్సమ్ యాసిన్ చెప్పారు. 7వ తేదీ నుంచి ఇంటికి వెళ్లలేదన్నారు. ఇజ్రాయిల్ గతంలో దాడులు చేసినా ఇలాంటి క్లిష్టపరిస్థితుల్ని ఎన్నడూ ఎదుర్కోలేదని చెప్పారు.

భూతల లక్షితదాడులు

జెరూసలేం: గాజాలో భూతల దాడిని ఇజ్రాయిల్ ప్రారంభించింది. బుధవారం అర్ధరాత్రి హమాస్ నియంత్రణలోని గాజాలోకి తమ యుద్ధ ట్యాంకర్లు ప్రవేశించి, లక్ష్యాలను ధ్వంసం చేసి తిరిగి వచ్చాయని ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) గురువారం ప్రకటించింది. భూతల దాడికి ఏర్పాట్లు చేసినట్లు ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహు ప్రకటించిన కొన్ని గంట్లోనే ఉత్తర పలస్తీనాలోకి యుద్ధ ట్యాంకులు ప్రవేశించినట్లు వెల్లడించింది. ఈ ఆపరేషన్‌ను 'టార్గెటెడ్ రైడ్' (లక్షిత దాడి)గా పేర్కొంది. హమాస్ స్థావరాలు, మౌలిక సదుపాయాలు, యాంటీ ట్యాంక్ క్షిపణుల ప్రయోగ కేంద్రాలపై దాడులు చేసినట్లు తెలిపింది. యుద్ధం తర్వాతి దశ సన్నాహాల్లో భాగంగా ఈ ఆపరేషన్ జరిగిందని వెల్లడించింది. సాయుధ వాహనాలు, బుల్‌డోజర్లు గాజా సరిహద్దు కంచె వైపు వెళ్తున్న బ్లాక్ అండ్ వైట్ వీడియోను ఐడీఎఫ్ విడుదల చేసింది. వీడియోలో కనిపించినది ఇజ్రాయిల్‌లోని అష్కెలోన్ నగరానికి దక్షిణంగా ఉన్న ప్రాంతమని ఏఎఫ్‌పీ వార్తాసంస్థ ధ్రువీకరించింది. మరో వీడియోలో వైమానిక దాడి చేయగా పెద్ద భవనాలు కూలిపోవడం, ఆ ప్రాంతాన్ని దుమ్ముధూళి కమ్మేయడం కనిపిస్తోంది. ఇజ్రాయిల్ తన ఉనికి కోసం పోరాడుతోందని నెతన్యాహు అన్నారు. హమాస్‌ను అంతం చేసేందుకు అమాయకుల ప్రాణాలు తీయొద్దని, వారికి రక్షణ కల్పించాలని అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడాలని ఇజ్రాయిల్‌కు ప్రపంచ దేశాలు సూచిస్తున్నాయి. భూతల దాడులతో ప్రాణ నష్టం భారీగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశాయి.

ఇది మారణహోమం- దెబ్బతిన్న 12 ఆసుపత్రులు

ఇజ్రాయిల్ ప్రతీకార దాడులల్లో ఇప్పటివరకు వేలాది మంది పిల్లలు సహా 6,500 మందికి పైగా పలస్తీనా ప్రజలు చనిపోయినట్లు గాజా ఆరోగ్య శాఖ ధ్రువీకరించింది. బుధవారం ఒక్క రోజు 700 మంది చనిపోయినట్లు తెలిపింది. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ ధ్వంసమయ్యాయి. ఆసుపత్రులకు వచ్చే క్షతగాత్రులను చూసి సర్జన్లు బెంబేలెత్తిపోతున్నారు. అనస్తీయా లేకుండానే చికిత్స అందిస్తున్నారు. ఐస్‌క్రీమ్ ట్రక్కులను తాత్కాలిక శవగారాలుగా వాడుతున్నారు. ఇది మరణహోమం... హమాస్‌పై కాదు పిల్లలపై జరుగుతున్న యుద్ధం అని స్థానికులు వాపోయారు. దాడుల్లో ధ్వంసం కావడం లేక ఇంధనం లేని కారణంగా 35 ఆసుపత్రుల్లో 12 ఆసుపత్రులు మూతబడినట్లు ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. తమ కార్యకలాపాలను తగ్గస్తున్నట్లు 6,00,000 మందికి సాయం అందించే ఐరాస సంస్థ వెల్లడించింది. తాగు నీటి సరఫరాను ఇజ్రాయిల్ నిలిపివేసింది. ఇప్పటివరకు 70 సహాయక ట్రక్కులు మాత్రమే గాజాలోకి ప్రవేశించగా కొండంత అవసరానికి గోరంత సాయంగా పరిణమిస్తోంది. ఇంధనం పంపితే దానిని హమాస్ స్వాధీనం చేసుకుంటుందన్న భయంతో దానిని సరఫరా చేసేందుకు ఇజ్రాయిల్ అంగీకరించడం లేదు. మరోవైపు ఆసుపత్రుల్లో జనరేటర్లు ఆగిపోతుండటంపై రెడ్ క్రాస్ ఆందోళన వ్యక్తంచేసింది. ప్రాణాలు నిలబెట్టే ఆసుపత్రులు శవగారాలుగా మారుతాయని హెచ్చరించింది. మందులు, వైద్య సామాగ్రి లేక పనిచేసే ఆసుపత్రులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. మత్తు మందు ఇవ్వకుండానే శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆసుపత్రి సర్జన్ వెల్లడించారు.

ఇజ్రాయిల్‌పై హమాస్ దాడికి భారత్-పశ్చిమాసియా-యూరప్ ఆర్థిక కారిడారే కారణమా: బైడెన్

'భారత్-పశ్చిమాసియా-యూరప్' ఆర్థిక కారిడార్‌పై ప్రకటన వల్లే ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి జరిగిందన్న అనుమానాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యక్తం చేశారు. తన అనుమానానికి బలం చేకూర్చే ఎలాంటి ఆధారాలు లేకపోయినా తాజా పరిణామాల దృష్ట్యా అది కారణమై ఉండవచ్చన్న భావన కలుగుతున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్‌తో శ్వేతసౌధంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బైడెన్ ఈ వ్యాఖ్యలు చేశాయి. భారత్‌లో జరిగిన జీ20 సందర్భంగా ఆర్థిక కారిడార్‌పై ప్రకటన వెలువడింది. ఈ ప్రాజెక్టును అమెరికా, భారత్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూరప్ నేతలు కలిసి ప్రకటించారు. అవగాహనా ఒప్పందంపై సంతకాలు కూడా చేశారు.

ఎన్సీఈఆర్టీ ప్రతిపాదనపై నిరసన వెల్లువ

న్యూఢిల్లీ: మోదీ సర్కార్ ఏకపక్ష, నియంతృత్వ నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోంది. పాఠ్యపుస్తకాల్లో ఇండియాకు బదులు భారత్ అని ముద్రించాలన్న జాతీయ విద్యా, పరిశోధనా శిక్షణామండలి (ఎన్సీఈఆర్టీ) తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై నిరసన వెల్లువెత్తుతోంది. ఇకపై పుస్తకాల్లో ఇండియా అనే పేరు వాడవద్దని ప్యానెల్ కమిటీ ఆమోదం తెలుపుతూ ఇండియా స్థానంలో భారత్ అనే పేరు మాత్రమే వాడాలని మార్గదర్శకాలు జారీ చేయటాన్ని రాజకీయ పార్టీ, విద్యార్థి, యువజన సంఘాలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

టెక్ట్స్ పుస్తకాల్లో ఇండియా పేరును భారత్‌గా ఉపయోగించాలన్న ఎన్సీఈఆర్టీ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్టు కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం పేర్కొంది. ఇది రహస్య ఎజెండాతో కూడిన "సంకుచిత రాజకీయం" అని, దక్షిణాది రాష్ట్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అంగీకరించబోదని తెలిపింది. కర్నాటకలోని కాంగ్రెస్, తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వాలు కూడా ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి.

కేరళ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి వి. శివన్‌కుట్టి కొల్లాంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ దేశం పేరును మార్చాలనే ప్రతిపాదనను రాష్ట్రం ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టంచేశారు. దేశ ప్రామాణికమైన చరిత్రను నేర్చుకునే అవకాశాన్ని కొత్త తరానికి నిరాకరిస్తూ, మొత్తం పాఠ్యాంశాలను "కాషాయం" చేయడానికి ఉద్దేశపూర్వక ప్రయత్నం జరుగుతోందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్ర సిలబస్‌ను అనుసరించే పాఠశాలలు ఎన్సీఈఆర్టీ ప్రతిపాదనను అడ్డుకుంటాయని తెలిపారు. సైన్స్, వాస్తవం, చరిత్రను వ్యతిరేకించే సంఘ్ పరివార్ మూకలు భారత దేశ గతాన్ని మార్చి యువతరం మెదళ్లలోకి చొప్పించాలని యత్నిస్తోందని అన్నారు. కేరళలోని పాఠశాల పాఠ్యపుస్తకాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 1లో సూచించిన విధంగా దేశం పేరును ఇండియాగా పేర్కొంటాయి. సంఘ్ పరివార్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన " డార్విన్ పరిణామ సిద్ధాంతం, మొఘలుల చరిత్ర, మహాత్మాగాంధీ జీవితం, హత్య" అధ్యాయాలను పాఠ్యపుస్తకాలలో కొనసాగిస్తాయని స్పష్టంచేశారు.

కేరళ గవర్నర్ వత్తాసు: పాఠ్యపుస్తకాల్లో "ఇండియా" స్థానంలో "భారత్" అని ముద్రించాలని ఎన్సీఈఆర్టీ కమిటీ సిఫార్సు చేయడాన్ని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సమర్థించారు. గురువారం తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడిన ఖాన్... 'ఇండియా' అనే పేరును ఇతరులు పెట్టారని... 'భారత్' అనేది దేశ ప్రజలు ఎంచుకున్న పేరని తెలిపారు. రాజ్యాంగంలో సవరణలు చేయాలని ఎవరూ ప్రతిపాదించలేదని ఆయన అన్నారు. కమిటీ చేసిన సిఫార్సులో కూడా ఇదే ఉందని చెప్పుకొచ్చారు ..కమిటీ ప్రతిపాదనపై వివాదాస్పదమైన క్రమంలో ఖాన్ పై విధంగా స్పందించారు. అనేక ప్రతిపక్ష పార్టీల నాయకులు ఈ సిఫార్సుపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. అధికార బీజేపీ చరిత్రను మార్చడమే లక్ష్యంగా పెట్టుకుందని... ప్రతిపక్ష కూటమి 'ఇండియా'ను చూసి ఓటమి భయంతో ఇటువంటి తీవ్రమైన చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. సాంఘిక శాస్త్రాల పాఠ్యాంశాలను సవరించడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్సీఈఆర్టీ) ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల్లో 'ఇండియా' స్థానంలో 'భారత్'ను చేర్చాలని సిఫార్సు చేసింది.

ఎన్నికల వేళ ఈడీ పంజా

(మొదటిపేజీ తరువాయి)

గతంలో కలిసి వ్యాపారం చేసినట్లు ఈడీ పేర్కొంది. ఇక పరీక్షాపత్రం లీక్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఏడు చోట్ల సోదాలు జరిగాయి. సిఖర్‌లోని లచ్‌మన్గర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి సుభాశ్ మహారియాపై దోతస్రా పోటీ చేయనున్నారు. ఆయన ఈ స్థానం సిట్టింగ్ ఎమ్మెల్యే కాగా మహువా నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న హుఢ్లా ఓ స్వతంత్ర ఎమ్మెల్యే. రాజస్తాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష కోసం ఒక్కొక్క అభ్యర్థి నుంచి రూ.8లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లు నిందితులపై ఆరోపణలు ఉన్నాయి.

ఓటమి భయంతోనే: బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు

ఎన్నికలకు ముందు దర్యాప్తు సంస్థల రూపేణ చివరి అస్త్రాన్ని మోదీ సర్కార్ రాజస్తాన్‌పై ప్రయోగించిందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించింది. దేశంలో భయోత్పాతం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టింది. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఈడీ ద్వారా బీజేపీ యత్నిస్తోందని ఆరోపించింది. రాజస్తాన్‌లోని తమ పార్టీ నాయకులపై ఈడీ దాడులను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే తీవ్రంగా ఖండించారు. ఎన్నికలకు ముందు బీజేపీకి పన్నా ప్రముఖ్ (పార్టీ కార్యకర్తలుగా) ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు మారాయని దుయ్యబట్టారు. రాజస్తాన్‌లో ఓటమి తథ్యమని గ్రహించి చివరి అస్త్రాన్ని బీజేపీ ప్రయోగించిందని విమర్శించారు. 'చత్తీస్‌గఢ్ తర్వాత రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచారంలోకి ఈడీ ప్రవేశించింది. కాంగ్రెస్ నేతలపై చర్యలు చేపట్టింది. మోదీ ప్రభుత్వ నిరంకుశత్వం ప్రజాస్వామ్యానికి చేటు. దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగుతుంది. బీజేపీకి ప్రజలే గుణపాఠం నేర్పుతారు' అని ఎక్స్ మాధ్యమంగా ఖడ్గే వ్యాఖ్యానించారు. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'చత్తీస్‌గఢ్, కర్నాటక లేక హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం ఎదైనాగానీ ఎన్నికలకు ముందు ఈడీ దాడులు జరగాల్సిందే. సోదాలు జరిగినా గానీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. ఈ పరిస్థితి ఆందోళనకరం. దేశంలో భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు' అని బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. యూపీఏ పదేళ్ల పాలనలో 112 దాడులు జరిగాయని, 104 కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయని గుర్తుచేశారు. 2014 తర్వాత 3,010 దాడులు, 881 కేసుల్లో చార్జిషీట్లు దాఖలైనట్లు చెబుతూ ఎన్డీయే పాలనను దుయ్యబట్టారు. 'కాంగ్రెస్ పార్టీ బుధవారం రాజస్తాన్ మహిళలకు కొన్ని హామీలు ఇచ్చింది... ఆ మరునాడే దొతాస్రా, వైభవ్ గెహ్లోత్‌పై చర్యలకు ఈడీ పూనుకుంది' అని గహ్లోత్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మీడియా, ప్రచార శాఖాధిపతి పవన్ ఖేరా 'ఎక్స్' మాధ్యమంగా స్పందిస్తూ 'గతవారం ఢిల్లీలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల్లో కేంద్ర సంస్థల పాత్రను గెహ్లోత్ ప్రశ్నించారు. ఈరోజు మరొకసారి రాజస్తాన్‌లో ఈడీ క్రియాశీలమైంది. మోదీ నేరుగా ఎన్నికల్లో పోటీ చేయాలి. కేంద్ర సంస్థల సాయం తీసుకోవడాన్ని ఆపేయాలి' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ కూడా ఈడీ చర్యలను వ్యతిరేకించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఐక్యంగా సంఘీభావం తెలుపుతున్నారని ట్వీట్ చేశారు. ఇటువంటి చర్యలకు కాంగ్రెస్ నేతలను బీజేపీ భయపెట్టలేదని వ్యాఖ్యానించారు. 'రాజస్తాన్‌లో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారు కాబట్టి ఇలాంటి చర్యలకు పూనుకుంటూ తన తత్తరబాటును బీజేపీ బయట పెట్టుకుంది' అని పైలట్ విమర్శించారు. కాగా రాజస్తాన్ అసెంబ్లీలోని 200 స్థానాలకు నవంబరు 25న ఎన్నికలు జరగనున్నాయి.

సీఏపీఎఫ్‌లో కానిస్టేబుల్ (జీడీ) పరీక్షల షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: కానిస్టేబుల్ రాత పరీక్షల షెడ్యూల్ వచ్చేసింది. ఢిల్లీ పోలీస్ కానిస్టేబుల్-ఎగ్జిక్యూటివ్ (పురుషులు, మహిళలు) పోస్టులకు నవంబరు 14, 15, 16, 17, 20, 21, 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో, డిసెంబరు 1, 2, 3వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) గురువారం ప్రకటించింది. సీఏపీఎఫ్‌లో కానిస్టేబుల్ (జీడీ), ఎస్ఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్‌లో రైఫిల్‌మ్యాన్ (జీడీ), నార్కొటిక్ కంట్రోల్ బ్యూరోలో సిపాయి పోస్టుల భర్తీకిగాను 2024, ఫిబ్రవరి 20, 21, 22, 23, 24, 26, 27, 28, 29 తేదీలు, మార్చి 1, 5, 6, 7, 11, 12వ తేదీల్లో రాత పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఎస్ఎస్‌సీ వార్షిక క్యాలెండర్‌లో ప్రకారం నవంబరు 24న ఈ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరు 28తో ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ పూర్తి కావాలి. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో పరీక్ష ఉంటుంది. ఎన్ని పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తారనేది ఆసక్తి నెలకొంది.

కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ జాతీయ రహదారిపై మొబైల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను టాటా సుమో వెనుకనుంచి ఢీకొట్టడంతో టాటా సుమోలో ప్రయాణిస్తున్న 13 మంది మృతి చెందారు. ఈ ప్రమాదంలో టాటా సుమో ముందు బాగా నుజ్జు నుజ్జు అయింది. దీంతో అక్కడికక్కడే 5 మంది దుర్మరణం చెందారు. మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. తెల్లవారుజామున పొగమంచు బాగా ఉండటంతో.. సుమో డ్రైవర్ ఆగి ఉన్న లారీని గమనించి ఉండకపోవచ్చుని... దీంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని చిక్‌బళ్లాపూర్ ఎస్పీ డీఎల్ నగేష్ తెలిపారు. మృతులు ఆంధ్రప్రదేశ్‌లోని గోరంట్లకు చెందినవారని, బెంగళూరులోని హెంగసంద్రలో

నివసిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రమాద స్థలిలోనే మృతి చెందగా... మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. దసరా పండుగకు సొంతూరికి వచ్చి మళ్లీ బెంగళూరుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. మృతి చెందిన వారిలో ఒక చిన్నారి, ముగ్గురు మహిళలు, 9 మంది పురుషులు ఉన్నారు. వీరిని శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం కలిగిరి కి చెందిన డ్రైవర్ నరసింహులు(45), వనవోలుకు చెందిన దంపతులు బోయ వెంకటాద్రి(27), బోయ లక్ష్మి (23), గోరంట్ల మండలం చౌడేశ్వరి కాలనీకి చెందిన తల్లీ కొడుకులు నేసే అరుణ (38), నేసే రిత్విక్ సాయి (07), ఓడిసి మండలం నవాబు కోట కి చెందిన దంపతులు వెంకటనారాయణ(51), వెంకటసుబ్బమ్మ (48), మలక వారి పల్లి చెందిన వర్గనగారి నారాయణ(56), కర్నాటకలోని మరగనికుంట్లకి చెందిన మంగళ నరసింహమూర్తి(42), కొత్తచెరువుకు చెందిన పవన్, చిలమత్తూరు మండలం మొరంపల్లి గ్రామానికి చెందిన గొల్ల గణేష్(17), పెనుగొండ మండలం గోనిపెంట గ్రామానికి చెందిన తల్లి కుమారుడు గొల్ల శాంతమ్మ (37), గొల్ల రజవర్ధన్ (15), మరకుంటపల్లికి చెందిన నారాయణప్ప (50)గా గుర్తించారు. ప్రమాద ఘటన గురించి తెలిసిన వెంటనే రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప తదితరులు చిక్‌బళ్లాపూర్ ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య డిమాండ్ చేశారు.

ఇళ్ల కోసం కళ్లు కాయలు

(మొదటిపేజీ తరువాయి)

సౌకర్యాలను కల్పించలేదు. జగనన్న కాలనీ నుంచి అప్రోచ్ రోడ్లనూ వేయకపోవడంతో, ఆ కాలనీలోకి వెళ్లేందుకే లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి, జిల్లాలో ఈ తరహా సమస్యలు ఎదురవుతున్నాయి. తమ స్థలం ఎక్కడ ఉందో తెలియక లబ్ధిదారులకు దిక్కుతోచని స్థితి నెలకొంది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ లబ్ధిదారులకు పట్టాలిచ్చినప్పటికీ, పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదు. వారి ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది.

అంతా ప్రచార ఆర్భాటమే...

జగనన్న ఇళ్ల నిర్మాణం పేరిట రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారాన్ని చేపట్టిందేగాని, ఆచరణలో వాటి పనులు పూర్తిస్థాయిలో ముందుకెళ్లడం లేదనే విమర్శలున్నాయి. దీంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అనేక లే అవుట్లలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. అక్కడక్కడా న్యాయపరమైన సమస్యలతో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ పథకంలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున అతి తక్కువగా స్థలం కేటాయించడంపై లబ్ధిదారులు అసంతృప్తితో ఉన్నారు. జగన్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో ఇరుకు స్థలాల మధ్య లబ్ధిదారులకు ఇళ్లను నిర్మించడాన్ని విపక్షాలు తప్పుపడుతున్నాయి. ఇంటి స్థల విస్తీర్ణాన్ని పెంచి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. మరోపక్క ఇళ్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడంలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జగనన్న కాలనీల ఇళ్ల పనులను వేగవంతంగా పూర్తి చేసి, తమకు అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నాను.

పోరాటాల ఫలితమే మహిళా హక్కులు

పశ్చిమ గోదావరి జిల్లా మహాసభలో దుర్గాభవాని

విశాలాంధ్ర -ఉండి: భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) పోరాటాల ఫలితంగానే మహిళా హక్కులు, చట్టాలు సాధించుకోగలిగామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గా భవాని అన్నారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన మహిళా సమాఖ్య జిల్లా 15వ మహాసభల్లో దుర్గా భవాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాసభకు నెక్కంటి జగదాంబ, సావారపు దేవి, యర్రంశెట్టి శాంతమణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. దుర్గాభవాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా మహిళా చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు.మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు.చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మహిళా సమాఖ్య దేశ వ్యాప్తంగా పోరాటాలు సాగించిందన్నారు.చట్టాన్ని ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లు 2029 తర్వాత అమల్లోకి వస్తాయనడం మహిళలను వంచించడమే నన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం, సాధికారతే తమ లక్ష్యమని చెపుతున్న ప్రభుత్వాలు ఆచరణలో మహిళలకు మొండి చేయి చూపుతున్నాయన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ మోదీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా దూసుకుపోతున్నా వారిని చిన్నచూపు చూడటం విచారకరమన్నారు.మహిళలు చైతన్య వంతులు కావడం ద్వారానే వివక్షత అధిగమించ గలుగుతారు.మహిళలు సంఘటితమై తమ హక్కులు, చట్టాల అమలుకు ఉద్యమించాలని భీమారావు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు ఉద్యమిస్తే పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ వుండదన్నారు.ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్,తిరుమాని కామేశ్వరరావు, సీపీఐ నాయకులు సనపల శ్రీనివాస్, మండల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.తొలుత మహిళా సమాఖ్య పతాకాన్ని జిల్లా ఉపాధ్యక్షులు సావారపు దేవి ఎగురవేశారు.

పక్కా లెక్కలున్నాయ్

తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బు అలా తరలించాం
రూ.1.30 కోట్లపై సోనోవిజన్ ఎండీ వివరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తమ డబ్బుకు పక్కా పత్రాలు, లెక్కలు ఉన్నాయని, తప్పనిసరి పరిస్థితుల్లో ఆ విధంగా తరలించాల్సి వచ్చిందని పట్టుబడ్డ రూ.1.30కోట్లపై సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి గురువారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. దసరా సేల్ ద్వారా వచ్చిన మొత్తాన్ని విశాఖ నుంచి విజయవాడకు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. అది అక్రమ సొమ్ము కాదని, పన్ను ఎగవేత ఉద్దేశాలు లేవని స్పష్టం చేశారు. ఎనిమిదేళ్లుగా హెచ్‌డీఎఫ్‌సీలో ఉన్న ఖాతాను ఇటీవల ఐసీఐసీఐకి మార్చడంతో ఓడీ సంబంధిత చెల్లింపుల క్రమంలో ఇలాంటి పరిస్థితి నెలకొన్నదన్నారు. 'హెచ్‌డీఎఫ్‌సీలో రూ.70 కోట్ల ఓడీ ఉంది. తమ శాఖలో కట్టే నగదుకు ఎలాంటి చార్జీలు లేకుండా తీసుకునేవారు. దానికి పత్రం కూడా ఇచ్చేవారు. కొద్ది నెలల నుంచి రూ.36.8లక్షలకు చార్జీలు వేశారు. అంబుడ్స్‌మెన్‌లో కేసు వేశారు. దీంతో మా సంస్థ ఖాతాను ఐసీఐసీఐ బ్యాంకు మర్చాం. ఐసీఐసీఐ బ్యాంకువారు రూ.11 కోట్లు ఓడీ ఇచ్చారు. మిగతా రూ.59 కోట్లుకు పత్రాల కోసం వారం, పది రోజులు పడతాయి. బ్యాంక్‌కు క్రమం తప్పకుండా డబ్బు చెల్లిస్తున్నాం. రూ.70 కోట్ల ఓడీ డాక్యుమెంట్ అయ్యేవరకు దసరా సేల్ ద్వారా వచ్చినది వైజాగ్ బ్యాంకు ఖాతాలో చెల్లిస్తే చార్జీలు పడతాయని తెలియడంతో రూ.1.30 కోట్లను విజయవాడ బ్యాంకులో కట్టాలని నిర్ణయించాం. అందుకోసం నగదును విజయవాడ శాఖకు బదిలీ చేయాలని ట్రాన్స్‌ఫర్ నోట్ కూడా పెట్టాం. ఈ శాఖకు కావాల్సిన 30 మొబైల్‌ఫోన్స్, ఆరు వాషింగ్ మెషిన్‌లు కూడా తరలించాం. నగదు విడిగా పెట్టేకంటే వాషింగ్ మెషింగ్‌లో పెడితే భద్రంగా ఉంటుందని భావించి ఆ విధంగా తరలించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విశాఖపట్నంలోని ద్వారకానగర్, గాజువాక, గోపాలపట్నం, మధురవాడ, విజయనగరం, శ్రీకాకుళం సహా 10 బ్రాంచీలలో వచ్చిన రూ.20.40 కోట్లు రాగా అందులో క్రెడిట్ కార్డ్స్, ఫైనాన్స్ భరత్‌పే అన్నీపోగా మిగిలిన దాంట్లో కొంత వైజాగ్ బ్రాంచ్‌లో కట్టి, రూ.1.30 కోట్లు విజయవాడ బ్రాంచ్‌లో కట్టడానికి తరలించాం. ఏ శాఖలో వచ్చిన డబ్బు ఆ బ్రాంచ్‌లోనే చెల్లిస్తాం. కానీ బ్యాంకు మారటం, దసరా సేల్ రావటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ విధంగా నగదు తేవాల్సి వచ్చింది. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదు. నల్లధనం, పన్నుఎగవేత వంటివి లేవు' అని భాస్కరమూర్తి వెల్లడించారు.

29, 30, 31 తేదీల్లో

జనసేన-టీడీపీ జిల్లా స్థాయి సమన్వయ సమావేశాలు

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈనెల 29, 30, 31 తేదీల్లో జిల్లా స్థాయిలో టీడీపీ-జనసేన సమన్వయ కమిటీల సమావేశాలు ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీ నేతలకు సూచించారు. పార్టీ తరపున ఆయా జిల్లాల పరిధిలోని ఇంఛార్జులతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు 50 మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. జిల్లా స్థాయి జనసేన-టీడీపీ సమన్వయ సమావేశాలు విజయవంతం చేసేందుకు కలసికట్టుగా కృషి చేయాలని సూచించారు. గురువారం జనసేన పార్టీ జిల్లాల అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా స్థాయి సమన్వయ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జనసేన - టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాలు సుహృద్భావ వాతావరణంలో జరగాలన్నారు. భవిష్యత్తు ప్రజా పోరాటాలు, ఆందోళనల్లో కలసికట్టుగా ముందుకు వెళ్లే విధంగా ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నవంబరు 1వ తేదీ నాటికి ఉమ్మడి మేనిఫెస్టో సిద్ధం అవుతుందని చెప్పారు. జనసేన షణ్ముఖ వ్యూహంతో పాటు టీడీపీ సూపర్ సిక్స్‌లో ప్రకటించిన అంశాలతో ఉమ్మడి మ్యానిఫెస్టో రూపొందుతుందన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడు సంతకాలతో కరపత్రాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రెండు పార్టీలు కలవకూడదన్న ఉద్దేశంతో ప్రత్యర్థి పార్టీ వ్యక్తులు కుట్రలు పన్నుతున్నారు. వారి ప్రచారం, అనుచిత వ్యాఖ్యల ఉచ్చులో పడవద్దని నేతలకు సూచించారు. తమతో బీజేపీ కూడా కలసి రావాలని కోరుకుంటున్నామని మనోహర్ తెలిపారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ మేనిఫెస్టోను పవిత్రంగా భావించి అందులోని ప్రతి హామీని నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం నేరవేర్చిందని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. సోషల్ మీడియా వేదికగా వివిధ అంశాలపై గురువారం స్పందించారు. 2014 ఎన్నికల ముందు టీడీపీ ఎడాపెడా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను చంద్రబాబు పార్టీ టిష్యూపేపర్‌లా పక్కన పడేసిందని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిందని అన్నారు. ఇదిలావుంటే, వీధికుక్కల దాడుల నుంచి ప్రజలను రక్షించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకోసం జంతు ప్రేమికులు, పశువైద్య నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, సమస్యకు పరిష్కారాలను సూచించే బాధ్యతను అప్పగించాలని విజయసాయి రెడ్డి డిమాండ్ చేశారు.

సీపీఐ విశాఖ జిల్లా సమితికి పెళ్లి కానుక

విశాలాంధ్ర - విశాఖ : విశాఖ ఉక్కు కర్మాగార ఉద్యోగి, ఏఐటీయూసీ గుర్తింపు సంఘం కార్యవర్గ సభ్యుడు ఎస్. మోహన్ బాబు, శాంతాదేవి కుమార్తె ప్రతిభకు కె. సుందరరావు, సునీత కుమారుడు మణిదీప్‌తో గురువారం ఉక్కు నగరం ఆంధ్ర కేసరి కళాక్షేత్రంలో వివాహం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ బాబు నూతన దంపతుల ద్వారా 10 వేల రూపాయలు విరాళంగా సీపీఐ విశాఖ జిల్లా సమితికి అందజేశారు. వివాహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు సీహెచ్ రాఘవేంద్రరావు, ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి. ఆదినారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. మన్మధరావు, జి ఎస్ జె అచ్యుతరావు, ఎస్ కె రెహమాన్, ఉక్కు ఏఐటీయూసీ నాయకులు టి. కనకరాజు, జె. రామకృష్ణ, కె. రాజాబాబు, చంద్ర వెంకటేశ్వరరావు తదితరులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

అధికార పార్టీ నాయకుల మాటలే చట్టాలా?

డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి కరవది

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అధికార పార్టీ నాయకుల మాటలే చట్టాలుగా మారుతున్నాయి. వారి మాటలే వేద వాక్కులుగా తప్పుచేయని వారిని కూడా తప్పు ఒప్పుకోవాలంటూ పోలీసులు బాధితుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు దుర్మార్గంగా ఉన్నదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణాజిల్లా మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ కొత్తపాలెం గ్రామ వైసీపీ కన్వీనర్ మత్తి రాజాచంద్ మాటలు విని ముగ్గురు గిరిజన మహిళలపై మహిళా ఎస్సై పాశవికంగా దాడి చేయటమే కాకుండా, నేరం ఒప్పుకోవాలని చిత్రహింసలకు గురిచేయడం విచారకరమన్నారు. ఈ ఘటనలో ఎస్సైని వీఆర్‌కు పంపగా, నిందితుడు రాజాచంద్‌కు కోర్టు బెయిల్ ఇచ్చిందన్నారు. బాధితులు కనీసం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కాకముందే నిందితునికి బెయిల్ వచ్చి యధేచ్ఛగా తిరుగున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలు, ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ఇప్పటికైనా నిందితులను కఠినంగా శిక్షించి బాధితులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితునిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కరవది డిమాండ్ చేశారు.

ఘనంగా జక్కంపూడి గణేశ్ వివాహ రిసెప్షన్

హాజరైన సీఎం జగన్

విశాలాంధ్ర - రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు విజయ్ గణేశ్ మోహన్ వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరయ్యారు. దివాన్ చెరువు డీవీబీ రాజు లేఅవుట్‌లో ఘనంగా జరిగిన వేడుకలో వరుడు గణేష్, వధువు సుకీర్తిని సీఎం జగన్ ఆశీర్వ దించారు. అనంతరం ఎమ్మెల్యే రాజా కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. జిల్లాలో జక్కంపూడి కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉండడంతో పాటు వధువు తండ్రి మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ కావడంతో రిసెప్షన్‌కు అనేకమంది రాజకీయ, సినీ ప్రముఖులు, మంత్రు లు, ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగన్ క్షమాపణ చెప్పాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామాజిక సాధి కార బస్సుయాత్రలో పాల్గొనే అధికార పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు, మంత్రులంతా ఆ యాత్రలో పాల్గొనేముందు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ నేతలతో కలిసి 'పేదల గొంతు కోస్తున్న పెత్తందారు జగన్ రెడ్డి' పేరుతో రూపొందించిన కరపత్రాన్ని అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నేతలు నక్కా ఆనంద్ బాబు, వర్ల రామయ్య, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎంఏ షరీఫ్, బుద్దావెంకన్న, నాగుల్ మీరా, కొల్లురవీంద్ర, కొనకళ్ల నారాయణరావు, తెనాలి శ్రావణ్ కుమార్, ముస్తాక్ అహ్మద్, బీ.రామాంజనేయులు, దున్నుదొర, దారు నాయక్ తదితరులు హాజరయ్యారు. కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం అచ్చెన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ... జగన్ అధికారం కోసం అన్ని వర్గాలను మోసగించి, అధికార అహంకారంతో వారి జీవితాలను తన స్వార్థానికి బలితీసుకున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగన్ బహిరంగ క్షమాపణలు చెప్పాకే బస్సుయాత్రలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరిగిన, కొనసాగుతున్న పరిణామాల సమగ్ర సమాచారమే 'పేదల గొంతు కోస్తున్న పెత్తందారు జగన్ రెడ్డి' కరపత్రం అని చెప్పారు. నాలుగున్నరేళ్లలో అధికార అహంకారంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను జగన్ ఊచకోత కోయించారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా ఏఏ వర్గాలకు తానేం చేసిందీ, ఎంతగా వారిని వంచించించారో చెప్పాకే జగన్ బస్సు యాత్రలు చేపట్టాలన్నారు. ఒక్క అవకాశమని తెలుగుజాతిని నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్... తన అసమర్థ, అవినీతి పాలనతో నాలుగు సంవత్సరాల ఏడు నెలల పాలనలో అన్నివర్గాల ప్రజల జీవితాలను తలకిందులు చేసి, చివరకు వారిని మభ్యపెట్టి, మరోసారి మోసగించడానికే తన పార్టీ నేతలు, మంత్రులతో సామాజిక సాధికార బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారని విమర్శించారు. 54 ఉత్తుత్తి కార్పొరేషన్లతో బీసీలను మోసగించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలకోసం ప్రత్యేకంగా 30 పథకాలు అమలు చేశామని, ఎస్సీలకు ప్రత్యేకంగా 27, ఎస్టీలకు 29, మైనార్టీలకు 11 అమలు చేసినట్లు వివరించారు. వాటన్నింటినీ జగన్ నిర్దాక్షిణ్యంగా రద్దు చేశారని మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో 20శాతంగా ఉన్న బీసీల రిజర్వేషన్లను చంద్రబాబు 14 శాతం పెంచి, 34శాతంగా మార్చారని వివరించారు. ఆ రిజర్వేషన్లను అధికారంలోకి రాగానే 24 శాతానికి ఎందుకు తగ్గించారో, జగన్ బీసీలకు సమాధానం చెప్పాకే సామాజిక సాధికార బస్సుయాత్ర చేపట్టాలన్నారు. బీసీ నేతలకు ఇచ్చిన మంత్రి పదవులతో ఆయా వర్గాలకు ఏం న్యాయం జరిగిందో సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు.

సీఐడీ కాల్‌డేటాపై విచారణ నేటికి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు సమయంలో అక్కడున్న సీఐడీ అధికారుల కాల్‌డేటా రికార్డులు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై సీఐడీ అధికారులు కౌంటరు దాఖలు చేశారు. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. అరెస్టుకు ముందు సీఐడీ అధికారులు కొందరు ప్రముఖులను ఫోన్ ద్వారా సంప్రదించారని, ఆ వివరాలు తెలిస్తే అరెస్టులో కీలక విషయాలు బయటపడతాయని చంద్రబాబు తరపు న్యాయవాది గత విచారణ సందర్భంగా వాదించారు. దర్యాప్తు సమయంలో కేసుకు సంబంధించి అధికారులు కొందరిని సంప్రదించాల్సి వస్తుందని, ఇది సహజమైన విషయమని సీఐడీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అధికారుల కాల్‌డేటా ఇవ్వడం గోప్యతకు భంగమని, దాని ప్రభావం విచారణపై ఉంటుందని వాదించారు. దీనిపై కౌంటర్ దాఖలుకు కోర్టు ఆదేశించగా, సీఐడీ అధికారులు గురువారం దానిని అందజేశారు. దీంతో తదుపరి విచారణ 27వ తేదీన జరుగుతుందని న్యాయమూర్తి వెల్లడించారు.

రోడ్డు ప్రమాద ఘటనపై పవన్ దిగ్భ్రాంతి

విశాలాంధ్ర-గుంటూరు: కర్నాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లాకు చెందిన 13 మంది వలస కూలీలు మృతి చెందడంపై జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందని అన్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పేదలైన మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఉపాధి కోసం కర్నాటకకు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో వీరు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని, తమ ప్రాంతంలోనే వారికి ఉపాధి అవకాశాలు లభించి ఉంటే పొరుగు రాష్ట్రాలకు వలసపోయే అవసరం ఉండేది కాదని పవన్ కల్యాణ్ అన్నారు.

8న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు

విశాలాంధ్ర-డోన్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నవంబర్ 8న చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం వామపక్ష విద్యార్థి యువజన సంఘాల అధ్వర్యంలో స్థానిక డోన్ సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ... విద్యార్థి యువజన నాయకులు 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులకు చేరుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు నవంబర్ 8వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కి పిలుపునిచ్చామన్నారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీకి గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలు ఐక్యం చేస్తామన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం విద్యార్థి యువజన సంఘాల అధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 8వ తేదీ వరకు జిల్లాలో అన్ని మండలాల్లో, నియోజకవర్గ కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, పత్రిక సమావేశాలు, సదస్సులు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పీజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్ కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సూర్య ప్రతాప్, ధనుంజయుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రణత్ యాదవ్, నాగరాముడు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రఫీ, అధ్యక్షుడు పవన్, ఏఐఎస్ఎఫ్ డోన్ మండల సమితి నాయకులు మనోజ్, శశిధర్ రెడ్డి, సిద్ధార్థ, సురేష్, ఈశ్వర్, ఏఐవైఎఫ్ నాయకులు నాగరాజు, శశి, రామకృష్ణ, ధను తదితరులు పాల్గొన్నారు.

పాక్షిక చంద్రగ్రహణం కారణంగా

రేపు శ్రీవారి ఆలయం మూసివేత

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: ఈ నెల 29న పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడనున్న దృష్ట్యా 28వ తేదీ (శనివారం) సాయంత్రం నుంచి తిరుమల శ్రీవారి ఆలయం మూతపడనుంది. దాదాపు 8 గంటలపాటు ఆలయ తలుపులు మూసివేస్తారు. 29న (ఆదివారం) తెల్లవారుజామున 1.05 గంటలకు గ్రహణం మొదలై 2.22 గంటల వరకు కొనసాగుతుంది. గ్రహణ సమయానికి ఆరు గంటల ముందు ఆలయ తలపులు మూసివేయడం ఆనవాయితీ కావడంతో 28న రాత్రి 7.05 గంటలకు ఆలయ తలుపులు మూసివేస్తారు. 29న తెల్లవారుజామున ఏకాంతంలో ఆలయాన్ని శుద్ధిచేసి ఏకాంతసేవ నిర్వహిస్తారు. అనంతరం భక్తులను తిరిగి శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం టీటీడీ స్థానికాలయాల తలుపుల్ని మూసివేస్తారు. తిరిగి ఆదివారం ఉదయం ఆలయాల తలుపులు తెరుచుకోనున్నాయి. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం సాయంత్రం 5 గంటలకు ఆలయ తలుపులు మూసివేస్తారు. తిరిగి ఆదివారం తెల్లవారు జామున 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు. సంప్రోక్షణ అనంతరం ఉదయం 7 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.

మూడో విడత ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీ సెట్-2023 రాసిన విద్యార్థులకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు గురువారం ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇప్పటికే మొదటి, రెండో విడత కౌన్సెలింగ్ లను నిర్వహించిందని గుర్తుచేశారు. మూడో కౌన్సెలింగ్ నిర్వహించాలని, చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. మొదటి, రెండు విడతల కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు, ఇతర ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు మూడో కౌన్సెలింగ్ లో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొదటి, రెండు కౌన్సెలింగ్ లలో 77 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయని, మిగతా 27,590 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తే 13వేల మందికి పైగా విద్యార్థులకు న్యాయం చేకూరుతుందన్నారు. దీనిపై విద్యాశాఖ మంత్రిని కోరామని నాగ మధు యాదవ్ తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టాలని కోరారు.

సంపాదకీయం

ఎన్.సి.ఇ.ఆర్.టి. కాషాయీకరణ

మూఢ నమ్మకాలు, విద్వేషం, హింస నుంచి బయటపడడానికి విద్య ఉపకరించాలి. విద్యా విధానం జాతీయ ఐక్యతను పరిరక్షించడానికి, సమాజంలో సోదరభావం పెంచడానికి, మత సామరస్యం పరిరక్షణకు వ్యక్తులలోనూ, సమాజంలోనూ నైతిక, మానవతావాద విలువలు ప్రోది చేయడానికి ఉపకరించాలి. విద్యార్థులలో శాస్త్రీయ, సవ్యమైన అవగాహన పెంపొందించడంకోసం సరైన పాఠ్య పుస్తకాలను, పాఠ్యక్రమాన్ని రూపొందించడానికే జాతీయ విద్య, శిక్షణ సమితి (ఎన్.సి.ఇ.ఆర్.టి.) ఏర్పాటు అయింది. కానీ ఈ లక్ష్యాలు గత చరిత్ర కింద మారనున్నాయి. ఎన్.సి.ఇ.ఆర్.టి. ఏర్పాటు చేసిన జాతీయ పాఠ్య ప్రణాళిక, బోధన, అభ్యసన కమిటీ ఆ సంస్థ తయారుచేసే పాఠ్య పుస్తకాలలో ఇండియా అన్న మాటను తొలగించి భారత్ అనే మాట వాడాలని సూచించింది. అంటే ఈ కమిటీ కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవడంలో అపారమైన సామర్థ్యం ప్రదర్శిస్తోంది. ఇండియా అన్న మాటను ఈస్టిండియా కంపెనీ వాడడం మొదలు పెట్టిందన్న ప్రభుత్వ పెద్దల ప్రవచనాన్ని ఎన్.సి.ఇ.ఆర్.టి. కమిటీ శంఖంలో పోసేసింది. 1757లో ప్లాసీ యుద్ధం తరవాతే ఇండియా అన్న మాట చెలామణిలోకి వచ్చిందని ప్రభుత్వ పెద్దల మనోభావాలకు అనుగుణంగా నిర్ధారించేసింది. మరి క్రీస్తుపూర్వం 350 నుంచి 290 మధ్య జీవించిన మెగస్తనీస్ రాసిన ఇండికాలో ఉన్నది ఇండియానే కదా? ఈ మాత్రం చారిత్రక జ్ఞానంలేని వారికి పాఠ్యాంశాలను మార్చే బాధ్యత అప్పగించడం తెలియక కాదు ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర. మారుతున్న కాలానికి, అవసరాలకు తగ్గట్టుగా పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళికలు మారాల్సిందే. కాని ఆ మార్పు విద్యార్థులను భావిపౌరులుగా దిద్దితీర్చే దిశలో కాకుండా హిందుత్వ ఎజెండాను అమలుచేస్తున్న పాలకవర్గాల అభిప్రాయానికి అనుగుణంగా మార్చేస్తూ ఉంటే కచ్చితంగా బాధ్యత ఉన్న పౌరులు ఆలోచించాల్సిందే. అవసరమైతే ప్రతిఘటించాల్సిందే. ఎన్.సి.ఇ.ఆర్.టి. పాఠ్య పుస్తకాలను హిందుత్వ ఎజెండాకు అనుగుణంగా మార్చడం కేవలం మోదీ హయాంలోనే జరగడంలేదు. వాజ్‌పేయి నాయకత్వంలో ఆరేళ్లపాటు కొనసాగిన పాలనలోనూ ఈ ప్రయత్నాలు జరిగాయి. అయితే అప్పుడు ఇంత కిరాతకమైన మార్పులు ప్రవేశ పెట్టలేదు. ఇప్పుడు బాహాటంగా హిందుత్వ ఎజెండాను అమలుచేసే ప్రయత్నాలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. విద్యా సంపన్నులు అనుకునే వారితో ఏర్పాటుచేసిన కమిటీలు ఈ ప్రయత్నానికి కావలసిన కుహనా వాదనలను ముందుకు తోస్తున్నాయి. ఎన్.సి.ఇ.ఆర్.టి. పాఠ్య పుస్తకాలను మార్చే ఎజెండాకు 2020లో ఆమోదించిన నూతన విద్యా విధానంలోనే బీజాలు ఉన్నాయి. ఈ విధానానికి కరోనా కరాళనృత్యం చేస్తున్న సమయంలో ఎలాంటి చర్చా లేకుండా పార్లమెంటు ఆమోదముద్ర వేయించుకున్నారు. అసలు ఇండియా బదులు మనదేశాన్ని భారత్ అనాలని మోదీ ప్రభుత్వం నిర్దేశించడానికి ప్రధాన కారణం ప్రతిపక్షాలు ఏకమై "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటు చేసుకోవడంతోనే మొదలైంది. ప్రతిపక్షాల ఐక్య సంఘటనకు "ఇండియా" అన్న పేరు పెట్టుకోవడంలో బీజేపీకి ప్రతిపక్షాల గర్వాంధత కనిపించింది. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఇదే వాదన లేవనెత్తారు. ఈ మాటకు మోదీ అడుగులకు మడుగులొత్తే గోదీ మీడియా విశేష ప్రచారం కల్పించింది. గోదీ మీడియాకు చెందిన పత్రికా రచయితలు, టీవీ చానళ్ల ఆంకర్లు మోదీ భాషను చిలకపలుకుల్లా వల్లించారు. ఇండియా అన్న మాటకు బదులు భారత్ అని మాత్రమే వినియోగించాలని ఎన్.సి.ఇ.ఆర్.టి.ని ఆదేశించడానికి ప్రభుత్వం భారత్ అనాలని చట్టం చేయకుండానే నిర్దేశించేయడం ఆశ్చర్యకరంగా ఉంది. బీజేపీ రాజకీయ ఎజెండాను పాఠ్యాంశాలలో, పాఠ్యక్రమంలో దూర్చాలని ఎన్.సి.ఇ.ఆర్.టి. కమిటీ ఎలా నిర్దేశిస్తుందో అంతుపట్టదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాఠ్యాంశాలు, పాఠ్యక్రమం వాస్తవ పరిస్థితులు, చరిత్రతో నిమిత్తంలేకుండా ఇష్టానుసారం మార్చేస్తుంటే భవిష్యత్ తరాలు ఎలాంటి విద్యనభ్యసిస్తాయో తలుచుకుంటేనే భయం వేస్తోంది. భారత చరిత్రను రాసిన బ్రిటిష్‌వారు మన చరిత్రను ప్రాచీన, మధ్యయుగాల, ఆధునిక చరిత్రగా విడగొట్టడమే అసంబద్ధం అని హిందుత్వ సమర్థకులు వాదిస్తున్నారు. ఈ గుంపులో ఎన్.సి.ఇ.ఆర్.టి. కూడా చేరి తరించిపోతోంది. ఈ ప్రాచీన చరిత్రలో అశోకుడు, చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడి ప్రస్తావన ఉండకూడదా. తమ ఎజెండాకు అనుకూలంగా ప్రభుత్వం రాజవంశాల చరిత్రను కూడా మార్చేస్తుందా? బ్రిటిష్ వారు రాసిపెట్టి పోయిన చరిత్ర సంపూర్ణ సత్యం కాకపోవచ్చు. సత్యాన్వేషణ చేయవలసిన అవసరాన్నీ కాదనలేం. ఆ సత్యాన్వేషణకు బదులు పాలక పక్షం రాజకీయ ఎజెండాకు అనుకూలంగా మారిస్తే చరిత్రను వక్రీకరించినట్టే. ఆర్యభట్ట, చరకుడు, ధన్వంతరి గురించి విద్యార్థులకు బోధించడం అపచారమవుతుందా? అశోకుడి కళింగ యుద్ధంలో రక్తంఏరులైపారి ఉండొచ్చు. ఆ విధ్వంసం నుంచి గుణపాఠం నేర్చుకున్నందువల్లే అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. మనిషిని మనిషిగా చూడాలన్నాడు. కొత్తగా రాస్తున్న చరిత్రలో మోదీ స్తోత్ర పాఠాలే ఉంటాయి అనడానికి ఒక్క ఉదాహరణ చాలు. చంద్రయాన్-3 సఫలం కావడానికి మోదీనే కారణం అని పాఠ్య పుస్తకాల్లో దూరిస్తే విద్యార్థుల భవిష్యత్తు భ్రష్టుపట్టి పోకుండా ఉండదు. దశాబ్దాలుగా ఇస్రో శాస్త్రవేత్తల శ్రమ వృథా అయిపోవాల్సిందేనా! విశ్వవిద్యాలయాలకు నిధులు సమకూర్చే విశ్వవిద్యాలయాల నిధుల సంఘాన్ని (యు.జి.సి.) మృతప్రాయం చేశారు. విశ్వవిద్యాలయాలకు నిధుల మంజూరుచేసే బాదరబందీ లేకుండా ఉన్నత విద్య నిధులకోసం రుణ సదుపాయం కల్పించే "హెఫా" (హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ ఏజెన్సీ) వ్యవస్థను సృష్టించారు. అంటే విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ నిధుల ఆసరాగా కాకుండా రుణాలమీద బండి నడపాల్సి వస్తుంది. అలా తీసుకున్న రుణాలను తీర్చవలసిందే. "హెఫా" 2017-18 నుంచి 2022-23 దాకా విశ్వవిద్యాలయాలకు భారీగా రుణాలు అందించింది. ఈ రుణాలు బోధనను మెరుగుపరచడానికి, నాణ్యమైన విద్య అందించడానికి తీసుకోవడంలేదు. విశ్వవిద్యాలయాల భవన నిర్మాణాలు మొదలైన అవసరాలకే తీసుకుంటున్నాయి. రుణాల మీద ఆధారపడి వ్యవహారం నడిపిస్తున్న విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులను నియమించక తప్పడంలేదు. ఈ దుస్థితి మోదీకి పట్టదు. రుణాలు తీర్చాలంటే విశ్వవిద్యాలయాల ఆదాయం పెరగాలి. ఆదాయం పెరగాలంటే ఫీజులు పెంచాల్సిందే. అందువల్లే ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. మచ్చుకు దిల్లీ విశ్వవిద్యాలయం విషయానికే వస్తే రూ.8,000 ఉన్న ఫీజు అమాంతం రూ.50,000 కు ఎగబాకింది. ప్రతి ఏడాదీ ఉన్నత విద్యాసంస్థల్లో ఫీజులు పెరుగుతున్నాయి. ఫీజుల పెంచడానికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన అలహాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థులు జైళ్లల్లో మగ్గుతున్నారు. మరో విచిత్రం ఏమిటంటే హర్యానాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కోవాలంటే రూ.500 చెల్లించాలట. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మాత్రం ప్రతి విద్యార్థికి రూ.11,000 ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇది విద్య ప్రైవేటీకరణను ప్రోత్సహించడమే. 2013-14లో కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి మన స్థూలజాతీయ ఉత్పత్తిలో 0.71 శాతం కేటాయిస్తే అది 2018-19లో 0.45 శాతానికి పడిపోయింది. ఇలాంటి సమస్యలను అధిగమించడానికి మోదీ ప్రభుత్వం కమిటీలు నియమించదు. కానీ తన రాజకీయ ఎజెండాలో భాగమైన ఇండియా బదులు భారత్ అని వాడాలని సిఫార్సు చేయడానికి మాత్రం కమిటీ నియమిస్తుంది. ఆ కమిటీ విద్యను కాషాయీకరించడానికి సహకరిస్తుంది. అదీ మన దుస్థితి.

పెరుగుతున్న మత అసహనం

సమాజ జనజీవన ప్రవంతిలో మనిషికి మతంతో పనిలేదు. కాని ప్రస్తుతం మతమే మనిషికి నియమ నిబద్ధతలు ఏర్పాటుచేసి నీడనిస్తున్న సంగతి మనం చూస్తున్నాం. ప్రతిమనిషి ఏదో ఒక మతం నియమ నిబద్ధతకు లోబడి జీననం సాగిస్తున్నాడు. పెరిగిన మత జోక్యంతోపాటు మత అసహనం కూడ రోజురోజుకు పెరుగుతోంది. ఒక మతమంటే మరొక మతానికి పడదు. ఆ రకంగా మతాలు మానవుల మధ్య ఉన్న అన్యోన్యత చెగడొట్టి ఒకరంటే ఒకరికి పడని విరోధులుగ మతం మారుస్తూ మత యుద్ధాలద్వారా మనిషికి మనిషికి మధ్య అగాధం ఏర్పడుతుంది. మనిషి స్వాతంత్ర్యం సంపాదించి తమనుతాము పరిపాలిచుకుంటున్నా మనిషి మతం కౌగిలి నుండి బైటపడలేకపోతున్న దుస్థితి నేడు నెలకొంది. ప్రభుత్వాలు మనిషి భావప్రకటనా స్వేచ్ఛను ఆపగలిగాయి కాని భావాలు కలిగిఉండే స్వేచ్ఛను ఆపలేవుకద. ఇదంతా పరిశీలిస్తే నియంతృత్వ ప్రభుత్వమైనా, ప్రజాస్వామ్య ప్రభుత్వాలైనా అధికార ప్రధానమైన రాజకీయంతప్ప భావ విప్లవంకోసం పనిచేయడంలేదని అర్థం చేసుకోవచ్చు. శాస్త్రజ్ఞానాన్ని కూడా వినియోగవాద దృక్పథంతో సాంకేతిక ప్రయోజనాలను వాడుకుంటున్న ఈ యుగంలో దాని తాత్విక ఫలితాలు ఎవరికి పట్టడం లేదు. వేల సంవత్సరాల నాటి అజ్ఞానమే ఛాందసంగా ఆధునిక

కాలంలోనూ కొనసాగుతోంది.

దైవప్రార్థన ద్వారా రోగాన్ని పోగొడుతామని పిలుచుకువెళ్లి ప్రాణాలుతీసి చివరకు వాడిఖర్మ అనే మోసగాళ్లు, హంతకులు, స్వాములు, బాబాలు మత స్వాతంత్ర్యం నీడలోనే వారి కార్యకలాపాలు సాగిస్తున్నారు. దయ్యాలు వదిలిస్తామని, పిల్లల్ని పుట్టిస్తామని, మోక్షం కల్గిస్తామని బహిరంగ ప్రకటనలిచ్చేవారిని ప్రభుత్వాలు శిక్షించలేవు. వారు మతం ముసుగులో ఉండటమే అందుకు కారణం. మత స్వాతంత్ర్యంపేరుతో అన్ని మతాలు అబద్ధాలు వల్లె వేస్తూనే ఉన్నాయి. కాని వాటిని విమర్శించేవారికి స్వాతంత్ర్యలేకుండా పోయింది. భావాలు కలిగి ఉండవచ్చుకాని, భావప్రకటనకు స్వాతంత్ర్యం లేకుండా పోయింది. దేవుడు మట్టిముద్దనుండి బొమ్మనుచేసి గాలిలో ఊదితే మనిషిగా మారాడని బైబిలు, ఖురాను చెబుతుండగా అది అబద్ధమని జీవపరిణామ క్రమంలో మనిషి అవతరించాడని ఆధునిక విజ్ఞానం రుజువులు చూపుతున్నది. కాని అది మతమూల గ్రంథాలకు విరుద్ధమని అది దైవదూషణగ భావించాలని మతం దండెత్తింది. ఆ రకంగా మతం జ్ఞానానికి సీలువేసింది. మత ప్రభుత్వాలు అందుకు దోహదపడ్డాయి. మతము, రాజ్యము ఒకదానికొకటి సహకరించుకుని పబ్బం గడుపుకుంటున్నాయి. మతం పరలోక జీవితాన్ని చూపి ప్రజల్ని దోచుకుంటుండగా ఏలేసారు ఇహలోక జీవనాన్ని మెరుగుపరుస్తామని దోచుకుంటున్న సంగతి చూస్తున్నాం. అందువల్ల వాస్తవికత ఆధారంగా తాత్విక భావాలను ఏర్పరచుకుని తనను సమిధగా అచరణ రూపొందించుకునే బాధ్యత ప్రజలది. ఆ బాధ్యత గుర్తెరిగే విధంగా పనిచేయడం భావోద్యమకారుల కర్తవ్యం. మతానికిస్వాతంత్ర్యం ఉంది. దాన్ని అడ్డుపెట్టుకుని అన్ని మతాలు అబద్ధాలు చెబుతూ దుర్మార్గాలను స్వాగతిస్తున్నాయి. అయితే ఆ మతాలను విమర్శించడానికి మనిషికి స్వాతంత్ర్యం లేకుండాపోయింది. అందుకు ప్రభుత్వాలే కారణం. ఇది తరతరాల చరిత్ర చెబుతున్న సాక్ష్యం. మాటల ద్వారానో, రచనల ద్వారానో అభిప్రాయాలు ప్రకటించే హక్కు భావప్రకటనా స్వాతంత్ర్యం అంటాం. ప్రస్తుతం ప్రజాస్వామ్య పాలనలో కూడా ఆ స్వాతంత్ర్యం కోల్పోయి భావాలు తనలోనే దాచుకునే పరిస్థితి నెలకొంది. దానికితోడు పత్రికా స్వాతంత్రం కూడా లేకుండాపోయింది. అన్ని మతాలుఅవిశ్వాసులపై ఘోరమైన నిందమోపి బైటకు పంపుతాయి. ఒక మతానికి, మరో మతానికి సరిపడదు. ఒకరిపై మరొకరు విమర్శల వర్షం కురిపిస్తూ అసహనం పెంచుకుంటున్నారు. మనిషి జ్ఞానవంతుడైతే మత పెద్దలకు మింగుడుపడదు. వారుచెప్పింది ప్రశ్నించకుండా గుడ్డిగా మనిషి నమ్మాలి. అలావారు చెప్పిందే వింటూ ఆలోచించకపోతే ప్రస్తుత దశకు సమాజం చేరేదికాదు. మతస్తుల మాట పెడచెవినిపెట్టి ఆలోచించబట్టి మానవుడు విజ్ఞానాన్ని సంపాదించి ముందుకు సాగుతున్నాడు. ఈ రోజున చంద్రునిపై కాలిడిన మనిషి మతం ముసుగులో నుండి బైటపడబట్టి సాధ్యమైంది. ఏ మతమూ స్వయం సిద్ధమైనదికాదు. ప్రతి మతమూ ఎపుడో ఒకప్పుడు ఎవరో ఒకరు ప్రారంభించిందే. ప్రతి మతము అంతకుముందున్న భావాలను తప్పుబట్టింది. విమర్శలకు గురైన మతాన్ని వదిలివాళ్ల మతం కావాలంటే పాత మతం ఒప్పుకోదు. ఈ విధంగా మనిషిని ప్రతి మతము నియమనిబంధనల ఇనపచట్రంలో బిగించినవే. కాన్ని వాటిని త్రోసిరాజని నేటి మానవుడు విజ్ఞానంతో ముందుకు సాగుతున్నాడు. దాంతో మతాలలో అసహనం పెరుగుతోంది.

సెల్ 98855 69394

మిజోరంలో కాంగ్రెస్ గెలిచే అవకాశం

సుశీల్ కుట్టి

మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు అవకాశాలు కనిపిస్తున్నాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైనప్పటికీ ఈసారి ఆ పార్టీ బలం పెరిగిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పరిపాలిస్తున్న మిజో నేషనల్ ఫ్రంట్(ఎమ్ఎన్ఎఫ్), ప్రతిపక్షం జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ గెలుపు అవకాశాలను వదులుకున్నాయని అంచనా వేస్తున్నారు. పొరుగునేఉన్న మణిపూర్‌లో జరిగిన అంతర్యుద్ధంలాంటి కల్లోలం కారణంగా బీజేపీకి అవకాశాలు ఉండవు. ముఖ్యమంత్రి జోరం తంగ నాయకత్వంలోని ఎమ్ఎన్ఎఫ్ అలాగే కాంగ్రెస్‌తో కలిసిన ఫ్రంట్ ఎమ్ఎన్ఎఫ్ మూడు, నాలుగుసార్లు ప్రభుత్వాలను ఏర్పాటుచేశాయి. మిజో శాంతి ఒప్పందంపై సంతకాలు చేసినతర్వాత ఈ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు సమర్థమైన పరిపాలనను, అభివృద్ధిని ప్రజలు అనుభవించారు. మణిపూర్ మంటల్లో కాలిపోతున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ కనీసం ఆ రాష్ట్రాన్ని సందర్శించి రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటామని హామీకూడా ఇవ్వలేదు. ఆ రాష్ట్రంలో కల్లోలం జరగడానికి కూడా బీజేపీనే కారణమని అందరికీ తెలిసిందే. ఫలితంగా మిజోరంలో బీజేపీకి ఆదరణ గణనీయంగా తగ్గిపోయింది. దీంతో మిజోరంలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు పర్యటించి ప్రచారం చేయనున్నారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ప్రచారం రంగంలో మోదీనే ముందుంటున్నారు. మణిపూర్‌లో మెయితీలు హిందువులుగా పూర్తి అధికారం చెలాయించేందుకు అక్కడ మంటలు రేపారని వివిధ గిరిజనజాతుల ప్రజలు బలంగా నమ్ముతున్నారు. ఈ పరిస్థితులలో మోదీకి కూడా పెద్ద పలుకుబడి లేదన్న వార్తలు వస్తున్నాయి.

మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్న సమయంలోనే కాంగ్రెస్ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ ఆ రాష్ట్రంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. సహాయ శిబిరాలను సందర్శించి అక్కడ పరిస్థితులను గవర్నర్ సైతం తెలియజేశారు. ఈ నేపథ్యంలో మణిపూర్‌లోనే కాక మిజోరంలోనూ ఆయన ఇప్పటికే పర్యటించి కొన్ని ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దారుల వెంట ప్రజలు నిలిచి రాహుల్‌గాంధీకి ఘన స్వాగతం పలికారు. అనేకమందిని పలకరిస్తూ తిరిగారు. మోదీ ఇంతవరకు మిజోరంలో పర్యటించలేదు. రాహుల్ పర్యటించడం తిరిగి వేరే రాష్ట్రాలకు వెళ్లడం జరిగింది. కాంగ్రెస్ రాష్ట్రంలోఉన్న మొత్తం 40 నియోజకవర్గాలలోనూ అభ్యర్థులను ప్రకటించనున్నారు. బీజేపీ మాత్రం 23 స్థానాలకు మాత్రమే పోటీ చేస్తున్నది. ఈశాన్యరాష్ట్రాలలో ప్రధాన బాధ్యతను అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మకు, త్రిపుర ముఖ్యమంత్రి మణిక్‌సాహాకు అప్పగించినట్లుగా తెలుస్తోంది. బిశ్వశర్మకుఈ ప్రాంతంలో మంచిపలుకుబడిఉంది. మిజోరంలో ప్రస్తుతం పరిపాలిస్తున్న ఎమ్ఎన్ఎఫ్‌తో కలిసి బీజేపీ అధికారంలో ఉన్నది. అన్ని పార్టీలవాళ్లు కలిసి 174 మంది పోటీచేస్తున్నారు. ఇందులో 16మంది మహిళలున్నారు. రాహుల్‌గాంధీ ఐజ్వాల్ పర్యటనలో వేలాదిమంది బహిరంగంగానే చేతులు కలుపుతూ తోడ్పాటు ప్రకటించారు. భారత్ జోడాయాత్ర సందర్భంగానూ రాహుల్‌కు మంచి ఆదరణ లభించింది.

బీజేపీకి షాక్:

ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా జరిగే బహిరంగ సభ వేదికపైన తాను కూర్చోబోనని మిజోరం ముఖ్యమంత్రి జోరంతంగ్ ప్రకటించారు. ఈ ప్రకటన బీజేపీకి షాక్ ఇచ్చింది. ఈసారి రెండుపార్టీలు కలిసి పోటీచేసే అవకాశంకూడా లేదని తెలుస్తోంది. నాగాలాండ్ నుంచి త్రిపుర వరకుఅన్ని రాష్ట్రాల్లోనూ క్రైస్తవ జనాభా చాలా ఎక్కువగా ఉంది. మణిపూర్‌లో జరిగిన అతర్యుద్ధాన్ని బీజేపీ పట్టించుకోకపోవడం, అనేక పదుల చర్చలను ధ్వంసం చేయడం కారణంగా ఈ సారి బీజేపీకి మిజోరంలో గెలుపు అవకాశం లేదని తెలుస్తోంది. ఇప్పటికే రాజకీయ వివాదం ఎమ్ఎన్ఎఫ్, బీజేపీల మధ్య తీవ్రంగా ఉన్నది. దీనికి తాజా వివాదం రేగింది. బీజేపీ పట్ల వ్యతిరేకత పెంచుకున్న ముఖ్యమంత్రి జోరంతంగ్ బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మోదీతో కలిసి ఒకేవేదిక నుంచి మాట్లాడే అవకాశం లేదని బీబీసీకి చెప్పారు. మణిపూర్‌లో చర్చిలపై దాడులుచేయడం, విధ్వంసాన్ని సృష్టించడం కారణంగా బీజేపీపట్ల బాగా వ్యతిరేకత ఏర్పడింది. అంతేకాదు, క్రైస్తవ నాయకులు బహిరంగంగానే బీజేపీని విమర్శించారు. అలాగే ఈ సారి ఎమ్ఎన్ఎఫ్ పరిస్థితికూడా అననుకూలంగా ఉన్నది. నవంబరు 7వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జోరంతంగ్ చేసిన వ్యాఖ్యలను ఈశాన్యప్రాంతంలో ఉన్న మీడియా ప్రకారం ప్రతిపక్షపార్టీలకు అంతగా ఆసక్తి కలిగించలేదు. కాంగ్రెస్‌పట్ల గతం నుండి ఉన్న వ్యతిరేకత ఇప్పుడుకూడా కొనసాగుతున్నది. ఆరునెలలకుపైగా మణిపూర్‌లో మంటలు రేగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఈశాన్యప్రాంత రాష్ట్రాలలో ప్రజలు బీజేపీపట్ల విముఖంగానే ఉన్నారు. అంతేకాదు, ఆర్థికంగా కూడా బాధితులకు పెద్దగా సహాయం మోదీ చేయలేదు. ప్రాథమిక దశలో కొంతసహాయం చేసినప్పటికీ అనంతరం ఐజ్వోల్‌లో ప్రజలు విజ్ఞప్తి చేసినప్పటికీ మోదీ మౌనంగానే ఉండిపోయారు. మిజోరంలో ఇప్పటికీ దాదాపు 45వేల మంది మణిపూర్ గిరిజనులు తలదాచుకుంటున్నారు. మణిపూర్‌నుంచి ముఖ్యంగా కుకీలు ఇతర గిరిజన ప్రజలు పెద్ద సంఖ్యలో మిజోరంకి తరలివెళ్లారు.

మాటల్లో కులగణన...పోటీలో అగ్రవర్ణాలు

డా.కత్తి పద్మారావు

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రారంభించిన బి.సీ. కులగణన ఇండియా కూటమికి ప్రధాన ఎజెండాగా ఉంది. దేశంలో సామాజిక న్యాయం సంపూర్ణంగా జరగాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సి.డబ్ల్యూ.సి. తీర్మానించడం ఒక చారిత్రకమైన మలుపు. అంతేగాక రాహుల్ గాంధీ ఇప్పుడు మా ముఖ్యమంత్రులలో బీ.సీ.లే ఎక్కువ ఉన్నారని ప్రకటించాడు. కర్నాటకలో సిద్ధరామయ్య, రాజస్థాన్‌లో అశోక్ గెహోత్, చత్తీస్‌ఘడ్‌కి భూపేష్ భగెల్, హిమాచల్ ప్రదేశ్‌కు సుఖ్వీందర్ సుక్కు నలుగురు బలహీన వర్గాలకు సంబంధించిన వారేనని, అంతేగాక వీరితో కలిసి ఆయన పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడటం సామాజిక న్యాయ దిశగా ప్రయాణంగా కనిపిస్తుంది. ఈ సందర్భంగా ఐదు ముఖ్యమైన రాష్ట్రాల్లో ఎన్నికల జరగటం ఒక సందర్భం. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మిజోరం, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల్లో దగ్గర దగ్గర 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 8.2 కోట్ల మంది పురుషులు, 7.8 కోట్ల మంది మహిళలు. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 5.6 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో దళిత బహుజన మైనార్టీలే 85 శాతం. అయితే అభ్యర్థులుగా నిలబడుతున్న వారు మాత్రం మెజార్టీ వర్గం అగ్రకులాలుగా ఉన్నారు.

డబ్బు, మద్యం నియంత్రించడానికి ఈ నాలుగు రాష్ట్రాల్లో 970 చెక్‌పోస్టులు పెట్టామని చెబుతున్నారు. నిజానికి ఎన్నికలు మొత్తం మద్యం, మాఫియా, డబ్బు పంపిణీలో మునిగిపోయిందని అందరికి తెలుసు. ఎన్నికల బరిలో కోటీశ్వరులు, ధనవంతులు, మత్తు మందుల మాఫియాలు, నల్లధనం కుబేరులు, అవినీతి సామ్రాట్‌లు, కల్తీ వ్యాపారులు, విద్యా వ్యాపారులు దేశాన్నే, ప్రపంచాన్నే ముంచగలిగిన అవినీతిపరులు. నీతి, నిజాయితిలేని, వ్యక్తిత్వం లేని, సామాజిక న్యాయ, ధర్మం లేని, జీవితానికి ఒక క్రమం లేని వారు ఎక్కువమంది పోటీ చేస్తున్నారు. హత్యలుచేసి కేసులుమాఫీ చేయించుకున్నవారు, స్త్రీలపై అఘాయిత్యంచేసి కేసుల్లో ఉన్నవారు ఎన్నికల్లో భారీగా ఉన్నారు. ఈ దుర్గుణాలకి పార్టీల భేదం లేదు. అందులో ఉన్నవారు ఇందులో ఉంటారు. ఆ పార్టీలో ఉన్నవారు టికెట్ లేకపోతే రెండో రోజే జంప్

అవుతారు. ఎక్కువ మందికి రాజనీతి లేదు. రాజ్యాధికారాన్ని ఒక దోపిడిగా భావించారు. కొన్ని ప్రాజెక్టులను దశాబ్దాలుగా పూర్తికాకుండా ఆ డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు. సామాజిక న్యాయానికి దూరంగా బ్రతుకుతున్న పార్టీలు ఇవన్నీ, ఇంతకుముందు ఇచ్చిన మానిఫెస్టోనే మరలా క్రొత్తగా వాటినే ప్రకటిస్తారు. అందుకే అంబేద్కర్ రాజ్యాంగాన్ని పూర్తిచేసిన తరువాత చేసిన ప్రకటన చాలా విలువైనది. 1950 జనవరి 26 నుంచి వైరుధ్యాల జీవితంలోకి మనం అడుగు పెట్టాము. రాజకీయాల్లో సమానత్వం, ఆర్థిక, సాంఘిక జీవితాల్లో అసమానత్వం. ఈ వైరుధ్యాలను తొలగించకపోతే అసమానత్వంతో బాధపడుతున్న ప్రజలు ఈ రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థను పేల్చివేస్తారు అని హెచ్చరించారు. ఇది చాలా వాస్తవమైన ప్రకటన. రాజ్యాంగం ఇచ్చిన హక్కును గౌరవించలేని అంధత్వం నేటి కుళ్లిన రాజకీయవ్యవస్థను వెంటాడుతోంది.

సామాజిక అసమానత్వం పునాదులు కూల్చాలంటే ఎదుగుతున్న వాణ్ణి గౌరవించి అభిమానించే మానసిక పరిపక్వత పెరగడమే ముఖ్యం. దీనికి కులం అడ్డువస్తుంది. చారిత్రక అవగాహనలేకపోవడం కూడా దీనికి కారణం. అంబేద్కర్ తన రాజకీయ ప్రజాస్వామ్యంలో భారతదేశానికి బ్రాహ్మణవాదం, పెట్టుబడిదారి వాదాలను శత్రువులుగా ప్రకటించాడు. బ్రాహ్మణవాదం అంటే ఇది బ్రాహ్మణులకు పరిమితమైంది కాదు. నా కులమే అన్ని కులాల కంటే అధికమైందనే భావం, ఆ కుల భావంతో ఇతరులను కించపరచడం రెండవది. నేను, నా కుటుంబం, నా కులం మాత్రమే ఆర్థికంగా పైకిరావాలని ఆలోచించడం. కులాన్ని, కుటుంబాన్ని దాటలేనివాడు రాజనీతిజ్ఞుడు కాలేడు. డా॥బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలు ఆనాటి నుండి ఈనాటి వరకు సమకాలీనంగానే ఉండడానికి కారణం సమాజంలో మార్పు చాలా ఆలస్యంగా జరుగుతుంది. నిజానికి కాంగ్రెస్ పార్టీ కూడా బి.సి.లకు మొదటి నుండి అన్యాయం చేస్తూనే వచ్చింది. మండల్ కమీషన్ నివేదికలో బి.సి.లకు ఎన్నో సంస్కరణలు ప్రాతిపాదించారు. 1951లో రాజ్యాంగంలో 15(4), 16(4) క్లాజులను పొందుపరచి రాజ్యాంగ పరంగా బి.సి. రిజర్వేషన్లకు వున్న అడ్డంకి తొలగించారు. అక్కడి నుండి 1978 వరకు పరిపాలనలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం బి.సి.లకు తమ రాజకీయ చదరంగంలో పావులుగా వాడుకున్నదే తప్ప వారి సంక్షేమానికి ఇసుమంత సౌలభ్యాన్ని కూడా కలిగించలేదు. 20-12-1978న అప్పటి జనతాపార్టీ ప్రధానమంత్రి మురార్జీదేశాయ్ పార్లమెంటులో చేసిన ప్రకటన మేరకు మాజీ పార్లమెంటు సభ్యులు బి.పి. మండల్ అధ్యక్షతన వెనుకబడిన తరగతులు కమిషన్ వేశారు. ఈ కమిషన్‌లో ఆర్ఆర్ బోలె, దివాన్ మోహన్ లాల్, దీనబంధు సాహు, కె. సుబ్రహ్మణ్యం, యన్.యన్. గిల్ సభ్యులుగా వున్నారు. ఈ కమీషన్ మొత్తం 40 సిఫార్సులను చేసింది.

మండల్ కమీషన్ నివేదిక అమలు జరపకపోవడం వల్లే ఆనాడు కాంగ్రెస్‌కు బి.సి.లు దూరమయ్యారు. ఆ తరువాత జనతా పార్టీ ఏర్పడిన తరువాత మండల్ కమీషన్ నివేదికలోని కొన్ని అంశాలు అమలుపై ఏర్పడి వివాదం మూలంగా ప్రభుత్వానికి బీజేపీ ఎసరుపెట్టింది. జనసంఘ్ బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీగా (బీజేపీ) రూపొందింది. ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రకటనలో మండల్ కమీషన్ ప్రస్తావన రాలేదు. బీజేపీ బీసీలంతా హిందువులే అని ప్రకటిస్తుంది. శూద్రులెవరు అనే గ్రంథంలో అంబేద్కర్ శూద్రులను ఎలా బానిసలుగా చేసిందో ఈ వైదిక సమాజం వేదాలు, బ్రాహ్మణాలు, ధర్మశాస్త్రాల ఆధారంగా నిరూపించారు. ఇవే భావాలు ఇప్పటికి ఆర్.ఎస్.ఎస్, విశ్వహిందూ పరిషత్, బి.జె.పి.కి ఉన్నాయి. నిజానికి అంబేద్కర్ దళితుల కోసమే కాదు, బహుజనుల కోసం, మైనార్టీలకోసం ఎంతో చేశాడు.

ఫోన్ : 984974695.

మూడేళ్లలో 21 మందికే ప్రభుత్వోద్యోగాలు !

- మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వ ఘనత
- నమోదైన నిరుద్యోగులు 39 లక్షలు



భోపాల్: మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలు దగ్గరపడడంతో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగ సమస్యపై రెండు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో 39 లక్షల మంది నిరుద్యోగ యువత ఉండగా వారిలో గత మూడేళ్లలో కేవలం 21 మందికి మాత్రమే శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. రాష్ట్ర శాసనసభలో 230 స్థానాలు ఉండగా నవంబర్ 17న ఒకే విడతలో పోలింగ్ జరుగుతుంది. 2008 నుంచి అంటే గత 16 సంవత్సరాలుగా శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని ప్రభుత్వ మే రాష్ట్రాన్ని పాలిస్తోంది. 2018 డిసెంబర్ నుంచి 2020 మార్చి వరకూ మాత్రం సీనియర్ నేత కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఉద్యోగాల కల్పనపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు హామీలు గుప్పిస్తుండడంతో అసలు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రత ఏ మేరకు ఉన్నదో పరిశీలించాల్సిన అవసరం ఉంది. గత సంవత్సరం శాసనసభ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారం 2022 ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రంలో 25.8 లక్షల మంది నిరుద్యోగ యువత నమోదయ్యారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఆ సంఖ్య 38,92,949కి పెరిగింది. దీనినిబట్టి చూస్తే మధ్యప్రదేశ్‌లో ప్రతి నెలా లక్ష మంది నిరుద్యోగులు తయా రవుతున్నారు. నమోదై న సుమారు 39 లక్షల నిరుద్యోగుల్లో గత మూడేళ్లలో కేవలం 21 మందికి మాత్రమే రాష్ట్ర ప్రభు త్వం ఉద్యోగాలు కల్పించగలిగింది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ కాదు. ఈ సంవత్సరం మార్చి 1వ తేదీన శాసనసభలో కాంగ్రెస్ సభ్యుడు మేవారామ్ జాతవ్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వమే ఈ మేరకు సమాధానం ఇచ్చింది.

రాష్ట్రంలో 2020 ఏప్రిల్ నుంచి 52 ఉపాధి కల్పన కార్యాలయాలు నడపడానికి ప్రభుత్వం రూ.16.74 కోట్లు ఖర్చు చేసింది. అంటే ఒక్కో నిరుద్యోగికి ఉద్యోగం ఇవ్వడానికి రూ.80 లక్షలు ఖర్చు చేసిందన్న మాట. కుంభకోణాల కారణంగా ఉద్యోగాలన్నీ పోయాయని కాంగ్రెస్ నేత శోభా ఓజా విమర్శించారు. ఉపాధి కల్పన కేంద్రాల్లో 40 లక్షల మంది పేర్లు నమోదు చేసుకుంటే కేవలం 21 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇవ్వడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో నర్సులు, పోలీస్ కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు, పట్వారీల నియామకాల్లో కుంభకోణాలు జరిగాయని మండిపడ్డారు. గత మూడేళ్లలో పరీక్షల ద్వారా నర్సుల నియామకాలే చేపట్టలేదని తెలిపారు. వేర్వేరు ప్రభుత్వ ఉద్యోగాల్లో లక్ష మందిని నియమించామని ముఖ్యమంత్రి చౌహాన్ గత నెలలో ప్రకటించారు. రాబోయే కాలంలో వేలాది మందికి ఉద్యోగాలు ఇస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు. అయితే మధ్యప్రదేశ్ ఆర్థిక సర్వే ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగం నిలకడగా పెరుగుతూనే ఉంది. గత సంవత్సరంలో మాత్రం నిరుద్యోగ రేటు కొంత తక్కువగా ఉంది. రాష్ట్రంలో నమోదైన నిరుద్యోగ యువతలో ఎక్కువ మంది ఓబీసీలే. నిరుద్యోగ యువతలో 30శాతం మంది ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు. మిగిలిన 70శాతం మంది ఓబీసీలు. గ్వాలియర్‌లో అత్యధికంగా 1.55 లక్షల మంది నిరుద్యోగులు నమోదవగా భోపాల్, రేవా, మొరేనాలు తర్వాత స్థానాల్లో నిలిచాయి.

ప్రజాస్వామ్యంపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తాం: ఈసీ

న్యూదిల్లీ: యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ పిలుపునిచ్చారు. యువత ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి విద్యార్థులకు ప్రజాస్వామ్యం-ఓటుహక్కుపై అవగాహన కల్పించడానికి త్వరలోనే ఎన్నికల సంఘం విద్యామంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటరు వహించే కీలక పాత్ర గురించి వారి విద్యార్థి రోజుల నుంచి అవగాహన కల్పించాలని రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. 'విద్యార్థులు 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఓటరుగా మారతారు. కానీ వారికి ఓటు విలువ, ఎలా ఓటు వేయాలి, ఎవరికి ఓటు వేయాలన్న విషయాలపై గురించి పెద్దగా అవగాహన కలిగి ఉండరు' అని ఆయన అన్నారు. విద్యాశాఖతో ఒప్పందం ద్వారా పిల్లల మనస్సుల్లో ప్రజాస్వామ్య మూలాలు నాటుకునేలా పాఠ్యాంశాల్లోకి ప్రవేశించాలని ఈసీ యోచిస్తోందని కుమార్ చెప్పారు. ఓటుపై అవగాహన కల్పించేందుకు ఈసీ 'నేషనల్ ఐకాన్'గా నటుడు రాజ్‌కుమార్‌రావును నియమించేందుకు జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మళ్లీ మెహబూబాకు పీడీపీ పగ్గాలు

జమ్ము: జమ్ముూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షునిగా మెహబూబా ముఫ్తీ మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో మూడేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ రెహ్మాన్ వీరి అధ్యక్ష పదవికి ముఫ్తి పేరును ప్రతిపాదించారు. ప్రధాన కార్యదర్శి గులాం నబీ హంజురా అధ్యక్ష పదవికి మెహబూబాను బలపరిచారు.

చొరబాటుకు యత్నించిన ఐదుగురు హతం

జమ్ము: భారత్‌లోకి ప్రవేశించేందుకు యత్నిస్తున్న ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో సరిహద్దుల ఆవల నుంచి చొరబాటుకు యత్నిస్తున్న ఐదుగురిని కాల్చిచంపాయి. మృతులకు లష్కరే తోయిబా ఉగ్రవాదులని సమాచారం. ఘటనా స్థలంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కుప్వారాలోని నియంత్రణ రేఖ దగ్గర నిర్దిష్ట సమాచారం మేరకు ఆర్మీ, పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించినట్లు ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ తెలిపింది. ఆపరేషన్ సమయంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. కుప్వారాలోని మచిల్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ దగ్గర భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు ఐదుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. డీజీపీ దిల్‌బాగ్ సింగ్ మాట్లాడుతూ నియంత్రణ రేఖ వెంబడి 16 లాంచింగ్ ప్యాడ్‌లు తయారు చేసినట్లు అంచనా ఉందన్నారు. సైన్యం, పోలీసులు సరిహద్దులో పూర్తిస్థాయిలో పటిష్టమైన నిఘా పెట్టినట్లు తెలిపారు.

31న హాజరుకావాలి

ఎంపీ మహువా మొయిత్రాకు ఎథిక్స్ కమిటీ ఆదేశం

న్యూదిల్లీ: పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తేందుకు డబ్బులు తీసుకున్నారంటూ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో లోక్‌సభ ఎథిక్స్ కమిటీ అక్టోబర్ 31న తమ ఎదుట హాజరుకావాలని మహువాను కోరింది. ఎథిక్స్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఆ సమావేశం పై మేరకు నిర్ణయం తీసుకుంది. ఎంపీపై ఆరోపణలు దర్యాప్తు చేసేందుకు హోం, ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి కమిటీ సహాయం తీసుకుంటుందని బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోంకర్ తెలిపారు. సమావేశం తర్వాత 31న ప్యానెల్ ముందు హాజరుకావాలని ఎంపీని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ వ్యవహారంలో ప్యానెల్‌లో వాకీస్ జై అనంత్ దేహద్రాయ్, బీజేపీ నేత నిషికాంత్ దూబే వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై విమర్శలు చేయడంతో పాటు అందుకు అనుగుణంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందాని నుంచి మహువా డబ్బులు తీసుకున్నట్లు నిషికాంత్ దూబే లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేశారు. ఈ క్రమంలో ఎథిక్స్ కమిటీ విచారణ జరుపుతున్నది. అయితే, మహువా మోయిత్రా ఈ ఆరోపణలు నిరాధారమైనవిగా కొట్టిపడేశారు. తన పరువు నష్టం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొంటూ బీజేపీ ఎంపీతో పాటు దేహద్రాయ్‌పై పరువు నష్టం కేసును దాఖలు చేశారు.

సాయినాథుని సన్నిధిలో మోదీ పూజలు

కొత్త దర్శన క్యూ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ప్రధాని

ముంబై: మహారాష్ట్రలోని షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన మంత్రి వెంట మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బాయిస్, సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఉన్నారు. మధ్యాహ్నం మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాలోని షిర్డీ విమానాశ్రయానికి ప్రధాని మోదీ చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ప్రధాని షిర్డీ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం రూ.112 కోట్లతో కొత్తగా నిర్మించిన దర్శనం క్యూ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. దీంతోపాటు భక్తుల కోసం నిర్మించిన భారీ సముదాయాన్ని ప్రారంభించారు. 10 వేల మందికి పైగా కూర్చునే సామర్థ్యంతో ఈ వెయిటింగ్ హాల్‌ను నిర్మించారు. ఇందులో టాయిలెట్లు, బుకింగ్ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, ఇన్ఫర్మేషన్ సెంటర్లు కూడ ఏర్పాటు చేశారు. కొత్త ఎయిర్ కండిషన్ కాంప్లెక్స్ పూర్తి చేయడానికి నాలుగేళ్లకు పైగా సమయం పట్టింది. ఈ కాంప్లెక్స్‌లో మొదటి, రెండో అంతస్తులో 12 పెద్ద హాల్స్ ఉన్నాయి. షిర్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ప్రధాని నీల్ వాండే డ్యామ్ వద్ద జలపూజ నిర్వహించి జాతికి అంకితం చేశారు. ఈ డ్యామ్ ద్వారా 182 గ్రామాలకు మంచినీరు అందనుంది. ఆ తర్వాత ఏరియల్ సర్వే నిర్వహించారు. షిర్డీలోని సాయిబాబా ఆలయానికి ప్రతి రోజూ సుమారు 50వేల మంది ఆలయానికి వస్తారని దేవస్థాన ట్రస్ట్ బోర్డు తెలిపింది. వారాంతంలో భక్తుల సంఖ్య 80వేలుగా ఉంటుంది. రామనవమి, దసరా, క్రిస్మస్ వంటి పర్వదినాల్లో రెండు లక్షల నుండి రెండు లక్షల యాభై వేల మంది భక్తులు వస్తుంటారు. ఏటా షిర్డి ఆలయానికి రూ. 400 కోట్ల విరాళాలు వస్తున్నాయి. కాగా కొత్త దర్శన కాంప్లెక్స్‌లో 45 వేల మంది భక్తుల మొబైల్, పాదరక్షలు భద్రపర్చేందుకు 14,538 లాకర్లను ఏర్పాటు చేశారు. వికలాంగులు, వారి సంరక్షకులకు ప్రత్యేక సౌకర్యాలు కూడ ఏర్పాటు చేశారు. నాలుగేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ షిర్డీలో పర్యటించడం రెండో సారి. 2018లో సాయిబాబా 100వ వర్థంతి సందర్భంగా మోదీ షిర్డీకి వచ్చారు.

న్యాయమూర్తులు క్రమశిక్షణ పాటించాలి: సుప్రీం

న్యూదిల్లీ: న్యాయమూర్తులు క్రమశిక్షణను పాటించాలని... ప్రధాన న్యాయమూర్తిచే కేటాయించబడకుండా ఏ కేసునైనా చేపట్టకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఓ కేసులో రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌ను విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి కేటాయించకుండా కేసును చేపట్టడం 'తీవ్ర అనుచిత చర్య' అన్న అత్యున్నత న్యాయస్థానం... ప్రాథమిక సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్‌లు) ను కలపడం కోసం సివిల్ రిట్ పిటిషన్‌ను ఎలా విచారిస్తారని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఎనిమిది ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి ముగ్గురిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని హైకోర్టు గత మేలో ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా చేసిన అప్పీల్‌ను న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కోరుతూ ముగ్గురు వ్యక్తులు మొదట హైకోర్టును ఆశ్రయించినప్పటికీ వారికి మధ్యంతర ఉపశమనం లభించలేదని ధర్మాసనం పేర్కొంది.

తిరోగమనంలో మోదీ పాలన

- పొరుగు దేశాలతో పోలిస్తే భారత్‌లోనే అత్యధిక నిరుద్యోగం
- ప్రపంచ బ్యాంకు నివేదిక

న్యూదిల్లీ: కేంద్రంలోని మోదీ సర్కారు పాలనలో భారత్ అన్ని రంగాల్లోనూ తిరోగమనం చెందుతున్నది. ప్రపంచ ఆకలి సూచీలో భారత్ అట్టడుగున నిలిచినట్లు ఇటీవలి నివేదికలో వెల్లడైన విషయం తెలిసిందే. పొరుగుదేశాలతో పోలిస్తే భారత యువతలో నిరుద్యోగిత రేటు అధికంగా ఉన్నట్టు ప్రపంచబ్యాంకు నివేదిక తెలిపింది. భారత్‌తో పోలిస్తే పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్‌లో పరిస్థితులు మెరుగ్గా ఉన్నట్టు ఆ నివేదిక పేర్కొన్నది. దేశంలో నిరుద్యోగం అతిపెద్ద సమస్యని 15-34 ఏళ్ల వయస్కుల్లో సుమారు 36 శాతం మంది అభిప్రాయపడ్డారు. లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. నిరుద్యోగ రేటు మన పొరుగున ఉన్న పాకిస్తాన్‌లో 11.3 శాతం, బంగ్లాదేశ్‌లో 12.9 శాతం, భూటాన్‌లో 14.4 శాతం ఉండగా మన దేశంలో 23.22 శాతంగా ఉంది. ప్రపంచబ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం చైనాలో 13.2 శాతం, సిరియాలో 22.1శాతం, ఇండోనేసియాలో 13 శాతం, మలేసియాలో 11.7 శాతం, వియత్నాంలో 7.4 శాతం, దక్షిణ కొరియాలో 6.4 శాతం, సింగపూర్‌లో 6.1 శాతంగా నిరుద్యోగ రేటు నమోదైంది. అంతర్జాతీయ కార్మిక సంఘం విడుదల చేసిన సమాచారం ఆధారంగా ప్రపంచబ్యాంక్ ఈ వివరాలు వెల్లడించింది. చేసేందుకు పనిలేక, ఉద్యోగం కోసం వెతుకుతున్న 15-24 సంవత్సరాల మధ్య వయసున్న యువతను పరిగణనలోకి తీసుకొని యువతలో నిరుద్యోగ రేటును అంచనా వేస్తారు.

కొత్త సవాళ్లకు సిద్ధమవ్వాలి

వైమానిక కమాండర్లకు రాజ్‌నాథ్‌సింగ్ పిలుపు

న్యూదిల్లీ: కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని వైమానిక దళ కమాండర్లకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. వైమానిక యుద్ధ రంగంలో కొత్త పోకడలు ఆవిర్భవించాయని, రక్షణ సంసిద్ధతను పటిష్టం చేసేందుకు వాటి నుంచి విశ్లేషించి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. రెండు రోజులు పాటు జరిగే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) కమాండర్ల సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైమానిక దళ అగ్రశ్రేణి కమాండర్ల నుద్దేశించి రాజనాథ్ సింగ్ ప్రసంగించారు. వేగంగా మారుతున్న ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు. భారత్ రక్షణపరంగా వాటిని అంచనా వేయాలని, ఆ మేరకు కార్యాచరణ సంసిద్ధతను పెంపొందించుకోవాలన్నారు. భారత వైమానిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంతోపాటు డ్రోన్‌ల వినియోగంపై దృష్టి సారించాలని ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులకు రాజ్‌నాథ్ సూచించారు. కాగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, హమాస్-ఇజ్రాయిల్ మధ్య ఘర్షణ జరుగుతున్న క్రమంలో వివిధ వైమానిక వేదికల వినియోగాన్ని భారత్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్లు విస్తృతంగా విశ్లేషిస్తున్నారని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ప్రపంచ భద్రతకు కొత్త సవాళ్లు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వాటిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడూ మనం సిద్ధంగా ఉండాలని భారత వైమానిక దళ కమాండర్లకు సూచించారు. త్రివిధ దళాలు ఉమ్మడిగా ప్రణాళికలు, కార్యకలాపాలు అమలు చేయాలన్నారు. మరోవైపు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, ఇతర కమాండర్లతో కలిసి చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భద్రతా పరిస్థితిని రాజ్‌నాథ్ సింగ్ సమీక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఎయిర్‌ఫోర్స్ డే పరేడ్, వైమానిక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించినందుకు ఐఏఎఫ్‌ను అభినందించారు. అలాగే హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, ఇతర వరద ప్రభావిత ప్రాంతాల్లో మానవతా సహాయం, విపత్తు సహాయ మిషన్లలో ఐఏఎఫ్ పాత్రను ఆయన ప్రశంసించారు.

మోదీకి అధికార వ్యామోహం

బీజేపీ మాజీ నేత సత్యపాల్ మాలిక్

శ్రీనగర్: ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వంపై జమ్మూ కశ్మీర్ మాజీ గవర్నర్, బీజేపీ మాజీ నేత సత్యపాల్ మాలిక్ మరోసారి ధ్వజమెత్తారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని, అక్కడి అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రెండింటినీ నెరవేరుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో ఇంతకుముందు హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ముఖాముఖిలో సత్యపాల్ మాలిక్ అనేక అంశాలను ప్రస్తావించారు. ఈ వీడియోను రాహుల్ గాంధీ తన సామాజిక మాధ్యమం ఛానెల్‌లో పోస్ట్ చేశారు. అధికరణం 370 రద్దు కన్నా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా తొలగించడమే స్థానికుల మనసులను అధికంగా గాయపరిచిందని సత్యపాల్ మాలిక్ తెలిపారు. ఆ అభిప్రాయంతో ఏకీభవించిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఈ విషయాన్ని గుర్తించానని అన్నారు. జమ్మూకశ్మీర్ సమస్యను సైనిక బలంతో పరిష్కరించలేరని, ప్రజల విశ్వాసాన్ని పొందితే ఏదైనా సాధించగలరని మాలిక్ తెలిపారు. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని మోదీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుందని విమర్శించారు. ప్రధాని మోదీ అధికార వ్యామోహంతో ఉన్నారని, ప్రతి చిన్న విషయాన్నీ ప్రచారం కోసం వినియోగించుకుంటున్నారని చెప్పారు.

రూ.11 కోట్లకు ఎరచూపి...

రూ.4 కోట్లకు టోకరా

వృద్ధ దంపతుల్ని మోసం చేసిన కేటుగాళ్లు

ముంబై: కోట్ల రూపాయలు వస్తాయని ఆశపెట్టి వృద్ధ దంపతులను రూ.4 కోట్లకు పైగా మోసం చేసిన ఘటన ముంబైలో జరిగింది ముందుగా ఓ యువతి బాధితురాలికి ఫోన్ చేసి పూర్తిగా నమ్మించింది. ఆ తర్వాత బ్యాంకు వివరాలు తెప్పించుకుని కోట్లాది రూపాయలకు మోసం చేసిందని పోలీసులు చెబుతున్నారు. దక్షిణ ముంబైకి చెందిన 71 ఏళ్ల వ్యక్తి భార్య కఫేపరేడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది మేలో తనకు ఒక మహిళ నుంచి కాల్ వచ్చిందని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కాల్ చేసిన ఆమె తాను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) నుండి మాట్లాడుతున్నట్లు తెలిపింది. ఫోన్ చేసిన యువతి... తన భర్త పనిచేసే కంపెనీ పేరు కూడా చెప్పింది. అది నమ్మిన బాధితురాలు తన భర్త పాన్‌కార్డ్ నంబర్, ఉద్యోగ విరమణ వివరాలను కూడా తెలియపర్చింది. కాగా మీ భర్త పనిచేసిన కంపెనీ... తన ఈపీఎఫ ఖాతాలో 20 ఏళ్ల పాటు రూ.4 లక్షలు జమ చేసిందని, అది 20 ఏళ్ల తర్వాత మెచ్యూ ర్ అయ్యిందని, ఇప్పుడు రూ. 11 కోట్లు పొందేందుకు ఆయన అర్హుడని యువతి ఫోన్లో బాధిత మహిళకు చెప్పింది. ఆ తర్వాత టీడీఎస్, జీఎస్‌టి, ఆదాయపు పన్ను చెల్లింపు కోసం అవసరమైన డబ్బును డిపాజిట్ చేయాల్సిందిగా కోరింది. ఆమెను నమ్మి బాధిత మహిళ ఎప్పటికప్పుడు ఆమె ఆదేశాల మేరకు బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేసింది. ఈ విధంగా నిందితురాలు ఆ వృద్ధ జంటను రూ.4.35 కోట్లకు మోసం చేసింది. మే నుంచి సెప్టెంబరు మధ్యకాలంలో అనేకమార్లు వివిధ సాకులతో డబ్బులు బదిలీ చేయాలని అడిగారు. కాగా కాల్ చేసిన మహిళ ఎక్కువ మొత్తంలో డబ్బు డిమాండ్ చేయడంతో అంత ఎక్కువ నిధులు తమ వద్ద లేవని ఆమెకు చెప్పగా... ఆ తర్వాత మళ్లీ కాల్ చేసిన మహిళ... ఐటీ శాఖకు సమాచారం ఇస్తానని బెదిరించడం ప్రారంభించింది. మోసపోయామని తెలుసుకున్న దంపతులు మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు భర్త గతంలో ప్రముఖ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) సర్వీసెస్ అండ్ కన్సల్టింగ్ కంపెనీలో పనిచేశారు. అతని ఉద్యోగ విరమణ తర్వాత వీరు పెట్టుబడి పెట్టిన నిధులను మెచ్యూరిటీ తర్వాత ఉపసంహరించుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ఆ బిల్లులపై తొందర ఎందుకు?

కేంద్రం వైఖరిని ప్రశ్నించిన ప్యానల్‌లోని విపక్ష ఎంపీలు

న్యూదిల్లీ: ఐపీసీ, సీఆర్‌పీసీ, సాక్ష్యాధారాల చట్టం స్థానంలో మూడు బిల్లులపై ముసాయిదా నివేదికలను ఆమోదించడంలో 'తొందరపాటు'ను హోం వ్యవహారాలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలోని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ప్రశ్నించారు. ఈ విషయమై ఈ వారంలో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా బిల్లులను పరిశీలిస్తున్న కమిటీ అక్టోబరు 27న ముసాయిదా నివేదికలను ఆమోదించనున్నట్లు నోటీసు ద్వారా సభ్యులకు తెలియజేసింది. కమిటీ వివరాల ప్రకారం, బిల్లుల పరిశీలన ప్రక్రియ గురించి ఆందోళనలు చేస్తూ కనీసం ఇద్దరు ప్రతిపక్ష ఎంపీలు ప్యానెల్ చైర్‌పర్సన్‌కు లేఖ రాశారు. సమావేశాన్ని వాయిదా వేయాలని కూడా కోరారు. 'తొందరపాటు' ను ప్రశ్నిస్తూ, అక్టోబరు 21 చివరి సాయంత్రం మాత్రమే తమకు పంపిన మూడు నివేదికలను పరిశీలించడానికి తమకు తగినంత సమయం లభించలేదని ఇద్దరు ఎంపీలు చెప్పారు. ప్రతిపక్ష 'ఇండియా కూటమి' పార్టీలకు చెందిన ప్యానెల్ సభ్యులు నివేదికలను స్వీకరించడానికి వ్యతిరేకంగా అసమ్మతిని తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నారు. 30 మంది సభ్యుల ప్యానెల్‌లో బీజేపీకి 16 మంది సభ్యులున్నారు. నిపుణులను పరీక్షలకు పిలవడంపై గతంలో ప్రశ్నలను లేవనెత్తిన ప్రతిపక్ష ఎంపీలు, వారు సూచించిన అనేక మంది నిపుణులను ఇంకా పిలవాల్సి ఉన్నప్పటికీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు షార్ట్ నోటీసు ఇవ్వడాన్ని వారు ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎంపీలలో ఒకరు, ప్యానల్ చైర్‌పర్సన్‌కు రాసిన లేఖలో భాగస్వామ్యులతో సంప్రదింపుల 'భయంకరమైన లోపాన్ని' ఎత్తి చూపారు. పరిశీలన కోసం వారు సూచించిన నిపుణుల జాబితాను పంచుకున్నారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్, ప్రముఖ న్యాయ నిపుణుడు ఫాలి నారిమన్, సీనియర్ న్యాయవాది రెబెకా జాన్, న్యాయవాది మేనకా గురుస్వామి పేర్లు జాబితాలో ఉన్నాయి. ప్యానెల్ సమావేశాన్ని వాయిదా వేయాలని అభ్యర్థిస్తూ, మరో ప్రతిపక్ష ఎంపీ తదుపరి పార్లమెంటు సమావేశానికి కనీసం నాలుగు వారాల సమయం ఉన్నప్పటికీ పండుగల మధ్యలో ముసాయిదా నివేదికను పంపారని ఎత్తి చూపారు.

మరోవైపు, దుర్గాపూజ తర్వాత బెంగాల్‌లో జరుపుకునే లక్ష్మీపూజకు ఒకరోజు ముందు సమావేశాన్ని పిలవడంపై ప్యానెల్‌లోని టీఎంసీ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. 'బెంగాల్ సంస్కృతి గురించి బీజేపీకి ఏమీ అర్థం కావడం లేదని ఇది చూపిస్తుంది' అని పార్లమెంటరీ ప్యానెల్‌లో భాగమైన టీఎంసీ ఎంపీ అన్నారు. ఈ బిల్లుల గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ, ఒక ప్రతిపక్ష ఎంపీ, వలసవాద కాలం నాటి విధానపరమైన చట్టాలను భర్తీ చేయడానికి ఉద్దేశించిన ఈ ప్రతిపాదిత చట్టాలు 'మరింత వలసవాదం' అని ఆరోపించారు. హోం వ్యవహారాలపై 30 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో చైర్‌పర్సన్‌తో సహా 16 మంది బీజేపీ ఎంపీలు, నలుగురు కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, జేడీ(యూ), బీజేడీకి చెందిన ఇద్దరు, శివసేనకు చెందిన ఒకరు ఉన్నారు. థ్రెడ్‌బేర్ ఎగ్జామినేషన్ కోసం బిల్లులను ప్యానెల్‌కు పంపాలని హోం మంత్రి అమిత్ షా లోక్‌సభ చైర్‌ను అభ్యర్థించడంతో మూడు బిల్లులను పరిశీలించి నివేదిక సమర్పించడానికి మూడు నెలల సమయం ఇచ్చారు. ఇప్పటి వరకు జరిగిన 11 సమావేశాల్లో లా కమిషన్ సహా అనేక మంది నిపుణుల అభిప్రాయాలను ప్యానెల్ తీసుకుంది. ఐపీసీ, సీఆర్‌పీసీ, సాక్ష్యాధారాల చట్టం భారతీయ నేర న్యాయ శాస్త్రానికి వెన్నెముకగా ఉండే వలసరాజ్యాల కాలం నాటి విధానపరమైన చట్టాలు.

వంతెనలు కూలినట్టే
కేసీఆర్ ప్రభుత్వం కూలుతుంది

- వైఫల్యాలు పక్కనబెట్టి సాకులు వెతుకుతున్నారు
- నాణ్యతలోపం వల్లే పిల్లర్ల కుంగుబాటు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర- హైదరాబాద్: రాష్ట్రంలో వంతెనలు కూలినట్టే కేసీఆర్ ప్రభుత్వం కూడా ఈ ఎన్నికల తరువాత కూలిపోతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీ బ్యారెజ్ పిల్లర్ కుంగిపోవడానికి ప్రభుత్వ వైఫల్యాలే కారణమని, వాటిని పక్కనపెట్టి ఎవరో ధ్వంసం చేశారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాకులు చెపుతోందని విమర్శించారు. సీపీఐ బృందం గురువారం మేడిగడ్డ వెళ్లి ప్రాజెక్టును పరిశీలించింది. ఈ బృందంలో నారాయణతో పాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులున్నారు. కరీంనగర్‌లో మానేరుపై దెబ్బతిన్న కేబుల్ బ్రిడ్జిని కూడా ఈ బృందం పరిశీలించింది. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ, కరీంనగర్ నగర శివారులో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులను మంత్రి గంగుల కమలాకర్ బంధువులకు అప్పనంగా అప్పజెప్పడంతో నాణ్యత లోపించే విధంగా నిర్మాణ పనులు పూర్తి చేశారన్నారు. లోపభూయిష్టంగా పనులు చేసిన మంత్రి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంధువులకు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికే కేబుల్ బ్రిడ్జి నిర్మించారని, వాటి నిర్మాణ పనులు మంత్రి గంగుల తన బంధువులకు అప్పజెప్పడంతోనే సంవత్సరం పూర్తికాక ముందే పగుళ్లు ఏర్పడడం, కుంగిపోవడం, తారు రోడ్డు చెడిపోవడం, మానేరు రివర్ ఫ్రంట్‌లో చెక్ డ్యాములు కొట్టుకపోవడం లాంటివి కళ్లకు కట్టినట్లుగా కనబడు తున్నాయన్నారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి తన పార్టీలోని మంత్రులు చేస్తున్న అవినీతి కనబడడం లేదా అని ప్రశ్నించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బ్రిడ్జిలు ఏ విధంగానైతే కూలిపోతాయో రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోక తప్పదని హెచ్చరించారు. కేబుల్ బ్రిడ్జీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని అంశంపై న్యాయవిచారణ జరపాలనీ, కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో నిర్మించిన కేబుల్ బ్రిడ్జిని చూస్తుంటే పైన పటారం లోన లొటారం లాగా ఉందని పైపై మెరుగులతో నిర్మాణం చేపట్టి అందంగా సుందరీకరణ చేశామని గొప్పలు చెప్పుకోవడం తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. అత్యుత్సాహంతో త్వరితగతిన పూర్తి చేసి నాణ్యత ప్రమాణాలను తుంగలో తొక్కారన్నారు. కేబుల్ బ్రిడ్జిని చూస్తుంటే కేసీఆర్, కేటీఆర్ తెల్ల జుట్టుకు నల్ల రంగు వేసుకున్నట్లు ఉందని అంత మాత్రాన దాని అసలు రంగు బయటపడక మానదని నారాయణ అన్నారు. కేబుల్ బ్రిడ్జి అందంగా అలంకరణగా ఉన్నదనే ఉద్దేశంతోనే ఇక్కడికి ప్రజలు సందర్శన కోసం వస్తారనీ, నాణ్యత ప్రమాణాలు దెబ్బతిని ప్రమాదవశాత్తు బ్రిడ్జి కూలిపోతే అనేకమంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందని నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు.

మేడిగడ్డ ప్రాజెక్ట్ కేసీఆర్ మానస పుత్రిక, ఆయన కలల ప్రపంచం. ఆ పేరు చెప్పుకొని ఇన్నాళ్లు బతికాడు. ఆ పేరుతోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని చూస్తున్నారన్నారు.. అలాంటి మానసపుత్రిక ప్రాజెక్ట్ అనేక చోట్ల పిల్లర్లు, రోడ్డు కృంగిపోతోందనీ, రోడ్డు కుంగిపోతోందన్నారు. ఒకసారి పరిశీలిస్తే హడావిడిగా షార్ట్ కట్ తోటి ఒత్తిడి చేసి చేసిన పనులు కనిపిస్తున్నాయన్నారు. పనులలో డొల్లతనం బయటపడేసరికి ప్రకృతి వైపరీత్యాలు, విద్రోహ చర్య అంటున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను పక్కనపెట్టి ఎవరో పాడు చేశారని సాకులు చెపుతున్నారు. తమకు గిట్టని వారిని ఇందులో ఇరికించే ప్రయత్నం చేయాలనుకుంటున్నారనీ, అందులో భాగంగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, చాడ వెంకటరెడ్డిని ఇరికించే ప్రయత్నం చేయొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. నామమాత్రపు విచారణ చేసి కేసు మూసివేసే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. కేంద్రం నుంచి నిపుణులు వచ్చి పరిశీలించి నాణ్యత లోపం లేదని కితాబిచ్చారన్నారు. సాంకేతికంగా తప్పులు ఉన్నాయని తెలిపారు. కేంద్ర బృందం నాణ్యత, సాంకేతిక లోపాలపై అవగాహన లేకుండా మాట్లాడుతుందన్నారు కేంద్రం కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని కాపాడాలనే ప్రయత్నం చేస్తున్నదని నారాయణ విమర్శించారు.

ఉత్పాదక రంగాలపై దృక్కోణ ప్రణాళిక

నీతి ఆయోగ్ వర్కుషాపులో ఇంధనం, పరిశ్రమలపై సమగ్ర చర్చ
సచివాలయ, విభాగాల అధిపతులు, జిల్లా స్థాయి అధికారుల హాజరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వికసిత్ భారత్-2047లో భాగంగా నీతి ఆయోగ్ సహకారంతో స్టేట్ విజన్ ప్లాన్-2047ను రూపొందించేందుకు ఏపీ ప్రణాళికా శాఖ అధ్వర్యంలో సచివాలయంలో నిర్వహిస్తున్న రెండోరోజు వర్కుషాపులో ఉత్పాదక రంగానికి సంబంధించి ముఖ్యమైన అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. గురువారం ఉదయం సెషన్‌లో ఇంధనం, రవాణా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పర్యాటకంపై చర్చించగా మధ్యాహ్నం నుంచి పరిశ్రమలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, ఏపీఐఐసీ, ఈడీబీ, ఏపీజీడీసీ, ఫుడ్‌ప్రాసెసింగ్, మైనింగ్, ఏపీఎండీసీ, చేనేత, గృహ, టిడ్కో సంబంధిత అంశాలపై దృక్కోణ ప్రణాళికలను రూపొందించేందుకు నీతి ఆయోగ్, రాష్ట్ర అధికారులు సమగ్ర చర్చలు జరిపారు. రాష్ట్రంలోని ఆయా రంగాలవారీగా ఉన్న బలాలు, బలహీనతలు, అవకాశాలు, సవాళ్లను సంబంధిత శాఖల అధికారులు... నీతి ఆయోగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రంగాలవారీగా ఉన్న బలహీనతలను అధిగమించేందుకు, సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకనుగుణంగా వ్యూహాత్మక దృక్కోణ ప్రణాళికలతో విజన్ ప్లాన్ రూపొందించేందుకు సూచనలు, సలహాలను నీతి ఆయోగ్ అధికారులు అందజేశారు. రాష్ట్ర ప్రణాళికాశాఖ కార్యదర్శి ఎం. గిరిజాశంకర్ ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్, ఏపీ జెన్‌కో డైరెక్టర్ చక్రధర్ బాబు, నెడ్‌క్యాప్ ఎండీ రమణారెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ రాజేశ్వరరెడ్డితో పాటు నీతి ఆయోగ్ సలహాదారులు పార్థసారధి రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు అమ్రిత్ పాల్‌కౌర్, సీనియర్ కన్సల్టెంట్ శైలీ మణికర్, పర్యవేక్షణ, మూల్యాంకన నిపుణులు విప్లవ్ నంది, బోస్టన్ కన్సల్టెంట్ గ్రూపు ప్రతినిధి అభిషేక్ పాల్గొన్నారు.

ప్రధానివి శూన్య వాగ్దానాలు: ప్రియాంక

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ మహిళా రిజర్వేషన్, ఈఆర్‌సీపీ వంటి శూన్య వాగ్దానాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా విమర్శించారు. ప్రధాని చేసిన మహిళా రిజర్వేషన్లు, ఓబీసీ కుల గణన, ఈఆర్‌సీపీ (తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్) అన్నీ శూన్య వాగ్దానాలేనని... ఎందుకంటే మోదీ జీ కవరు ఖాళీగా ఉందని ఆమె పేర్కొన్నారు. తన వాట్సాప్ ఛానల్‌లో ఈ మేరకు హిందీలో గురువారం ఆమె పోస్ట్ చేశారు. తప్పుడు వాదనలు చేయడానికి ప్రియాంక గాంధీ వాద్రా ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగత మతవిశ్వాసాన్ని ప్రేరేపిస్తున్నారని బీజేపీ ఆరోపించిన ఒక రోజు తర్వాత ప్రియాంక స్పందిస్తూ... 'నా ప్రకటనతో బీజేపీ నాయకులు చాలా కోపంగా ఉన్నారు, వారు నాపై కేసు పెట్టారు. నేను టీవీలో చూశానని చెప్పాను. ప్రధాని దేవనారాయణ్ జీ గుడి వద్దకు వచ్చారు. కవరు తెరిచి నప్పుడు అందులో రూ. 21 కనిపించాయి' అని తెలిపారు. మోదీ జీ కవరు ఖాళీగా ఉందని ఆయన చేసే పని కూడా చూపిస్తోందన్నారు. అక్టోబరు 20న దౌసాలో జరిగిన బహిరంగ సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... ఓ గుడిలో మోదీ ఇచ్చిన విరాళాల కవరు తెరిచినప్పుడు అందులో కేవలం రూ. 21 మాత్రమే ఉందని టీవీలో చూశానని అన్నారని బీజేపీ ఫిర్యాదులో పేర్కొంది. ప్రియాంకపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పూరీ, అర్జున్ రామ్ మేఘ్వాల్, పార్టీ నేతలు అనిల్ బలూనీ, ఓం పాఠక్‌లతో సహా బీజేపీ ప్రతినిధి బృందం బుధవారం ఈసీకి ఫిర్యాదు చేసింది.

జగన్‌కు రాష్ట్రాభివృద్ధి పట్టదు

కక్షసాధింపుకు మూల్యం చెల్లించుకోవాల్సిందే
తిరుపతి సభలో భువనేశ్వరి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: రాష్ట్ర మహిళల ఉసురు జగన్ మోహన్‌రెడ్డికి తగలక మానదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నిజం గెలవాలి - నిజమే గెలవాలి' బస్సుయాత్రలో భాగంగా గురువారం తిరుపతిలో మొదటి బహిరంగ సభ నిర్వహించారు. సభలో భువనేశ్వరి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. అభివృద్ధి అంటే ఏంటో... ఎలా ఉండాలో 14 ఏళ్ల తన పరిపాలనలో అమలు చేసి చూపిన చంద్రబాబును కక్షసాధింపు ధోరణితో కేసుల్లో ఇరికించి ఘోష పెట్టాడని జగన్‌పై మండిపడ్డారు. ఇందులో పాత్రధారులందరూ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తప్పుడు విధానాలు అవలంభించడం, దర్యాప్తుల పేరుతో వేధింపులకు గురిచేయడం దారుణమన్నారు. పసలేని పనికిమాలిన విచారణలు ఎందుకని ప్రశ్నించారు. పిచ్చి ఆలోచనలు తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న తపన జగన్‌కు లేదని దుయ్యబట్టారు. జీవితంలో సమస్యలు మామూలే, తెలుగుదేశం పార్టీకి ఇలాంటి కష్టాలు కొత్త కాదని ఉద్ఘాటించారు. తమ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని భువనేశ్వరి వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ నుంచి పౌరుషాన్ని, చంద్ర బాబు నుంచి క్రమశిక్షణ, ఓర్పు నేర్చుకున్నట్లు తెలిపారు. చంద్రబాబు పడిన కష్టాన్ని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. ఆయన కోసం మహిళలు రోడ్లపైకి వచ్చి పోరాడుతున్నారని, అరెస్టులకు గురవుతున్నారని చెప్పారు. రాజమండ్రి జైలు నుంచి చంద్రబాబు రాసిన లేఖపై ప్రభుత్వ విచారణ విడ్డూరంగా, హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు మరింత చైతన్యంగా, నిజాలు తెలుసుకుని జగన్‌కు బుద్ధి చెబుతారన్నారు. సభలో నాయకులు పులివర్తి నాని, గొల్ల నరసింహ యాదవ్, సుగుణమ్మ, శ్రీధర్ వర్మ, మునికృష్ణ, పుష్పావతి యాదవ్, కంకణాల రజనీ, దినకర్ రాయల్, జనసేన నేతలు కిరణ్ రాయల్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆజంఖాన్‌ను ఎందుకు కలవనివ్వడం లేదు: రాయ్



సీతాపూర్/లక్నో: ప్రస్తుతం జైల్లో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్‌ను ఎందుకు కలనివ్వడం లేదు? ఎందుకని ప్రభుత్వం భయపడుతోంది? బీజేపీ పాలకులు, అధికారులు ఏం దాస్తున్నారు? అని రాష్ట్ర యంత్రాంగాన్ని కాంగ్రెస్ యూపీ అధ్యక్షుడు అజయ్ రాయ్ నిల దీశారు. ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వ ఒత్తిడి వల్లే ఆజం ఖాన్‌ను కలిసేందుకు తనకు జైలు అధికారులు అనుమతి ఇవ్వలేదన్నారు. కష్టాల్లో ఉన్న ఆజం ఖాన్‌ను పరామర్శించే ఉద్దేశంతో, ఆయన బాధను కాస్తైనా పంచుకో వాలని భావించి ఆయనను మనవతా దృక్కోణంలో కలవాలని అనుకున్నట్లు తెలిపారు. ఆజం ఖాన్‌ను, ఆయన కుటుంబాన్నీ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుం టోందని గురువారం విలేకరులతో మాట్లాడిన రాయ్ ఆరోపించారు. మిమ్మల్ని కలిసేందుకు ఆజం ఖాన్ నిరాకరించారా అని విలేకరులు ప్రశ్నిస్తే 'అందుకు రుజువు ఉందా? ఆయన రాత పూర్వకంగా తెలిపారా? అని ఎదురు ప్రశ్నించారు. ఆజంఖాన్ ఖైదీగా ఉన్నందున ఆయనతో అధికారులు ఏమైనా చెప్పించగల రన్నారు. 2019 నాటి నకిలీ జనన పత్రం కేసులో ఆజం ఖాన్‌తో పాటు ఆయన భార్య తజీన్ ఫాతిమా, తనయుడిని దోషులుగా రాంపూర్ కోర్టు గతవారం తేల్చింది. దీంతో వారిని రాంపూర్ జిల్లా జైలుకు తరలించారు. ఆపై ఆజం ఖాన్‌ను సీతాపూర్ జిల్లా జైలుకు, ఆయన కుమారుడిని హర్దోయి జిల్లా జైలుకు మార్చారు. మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్ల సర్దుబాటులో కాంగ్రెస్, ఎస్పీకి ఏకాభిప్రాయం కుదరని సమయంలో ఆజం ఖాన్‌తో భేటీకి రాయ్ ప్రయత్నించడం చర్చనీ యాంశంగా మారింది. ఈ పరిణామంపై సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఆజంఖాన్‌పై తప్పుడు ఆరోపణలు మోపినప్పుడు కాంగ్రెస్ నేతలు ఏమయ్యారని ప్రశ్నించారు. ఆయనను నిందించడంలో వారు బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. అయితే 15 రోజుల్లో రెండుసార్లు మాత్రమే ఖైదీలను కలిసేలా జైలు నిబంధనలు న్నాయని, బుధవారం ఆజం ఖాన్ కుమారుడు అదీప్ ఆజం ఖాన్ ఆయనను కలిశారని జైలు సూపరింటెండెంట్ సురేశ్ తెలిపారు. కలిసేం దుకు వచ్చిన వారితో భేటీకి ఖైదీ అంగీకరిస్తేనే ములాఖత్ జరుగుతుందన్నారు.

షెంజౌ-17 విజయవంతం

ఆరున్నర గంటల్లో అంతరిక్ష కేంద్రానికి

బీజింగ్: చైనాకు చెందిన షెంజౌ-17 ప్రయోగం విజయవంతమైంది. జియుక్వాన్ ఉపగ్రహాల ప్రయోగ కేంద్రం నుంచి గురువారం దీనిని ప్రయోగించగా ఆరున్నర గంటల్లోనే టియాంగాంగ్ అంతరిక్ష కేంద్రం ఫార్వర్డ్ పోర్ట్‌కు చేరుకుని రికార్డు సృష్టించింది. చైనా అంతరిక్ష ప్రయోగ సెంటర్ కమాండర్ ఈ మేరకు ప్రకటించింది. అంతరిక్ష కేంద్రానికి ఆరో వ్యోమగాముల బృందం చేరుకున్నట్లు తెలిపింది. ఈసారి అతి పిన్న వయస్కులైన వ్యోమగాములను అంతరిక్ష కేంద్రానికి పంపడం 12వ మిషన్ ప్రత్యేకతగా పేర్కొంది. ఈ ఏడాది మే నుంచి టియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌లో ఉన్న షెన్‌జౌ-16 క్రూ సిబ్బంది స్థానాన్ని షెన్‌జౌ-17 వ్యోమగాములు భర్తీ చేస్తారు. షెన్‌జౌ-16 క్రూ సిబ్బంది 31వ తేదీన భూమికి తిరిగివస్తారు.

కాబోయే ప్రధాని రాహుల్ కాదు అఖిలేశ్

కాంగ్రెస్, ఎస్పీ బ్యానర్ల రగడ

లక్నో: దేశానికి కాబోయే ప్రధాని అఖిలేశ్ యాదవ్ అని సమాజ్‌వాదీ పార్టీ బ్యానర్ ఏర్పాటు చేసిన కొద్దిరోజుల్లోనే భావి ప్రధాని రాహుల్ గాంధీ అన్న బ్యానర్ యూపీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం వెలిసింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో '2024లో రాహుల్ గాంధీయే ప్రధాని' అనే బ్యానర్‌ను కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. భావి ప్రధాని అఖిలేశ్ యాదవ్ అనే బ్యానర్‌ను ఎస్పీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కొద్ది రోజులకు ఈ పరిణామం చోటు చేసుకోవడం రెండు వర్గాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలకు దారితీసింది. 2027లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అజయ్ రాయ్ (పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు) అని కాంగ్రెస్ హోర్డింగ్ పేర్కొంది. ఈ బ్యానర్‌ను కాంగ్రెస్ కార్యకర్త నితిన్ ఏర్పాటు చేశారు. దీనిపై రాహుల్, రాయ్‌ల ఫొటోలతో '2024లో రాహుల్, 2027లో రాయ్, దేశంతో పాటు రాష్ట్రం కూడా ఇదే కోరుకుంటోంది. ఇందుకు 'చెయ్యి (హస్తం గుర్తు)' అందిస్తోంది' అని రాసివుంది. నితిన్ మాట్లాడుతూ 'ఇది పార్టీ కార్యకర్తల భావన, సామాన్యులు కూడా కాంగ్రెస్‌తో కలిసి రావాలని కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు బీజేపీకి మధ్య ప్రత్యక్ష పోరు జరుగుతుంది. రాహుల్ తదుపరి ప్రధాని అయితే, అజయ్ రాయ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారు. మా పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది' అని అన్నారు. తాజా పరిణామంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రాష్ట్ర అధికార ప్రతినిధి ఫఖ్రుల్ హసన్ 'చాంద్' స్పందించారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల కోసం పోరాడుతున్న పార్టీ తమదే కాబట్టి కాంగ్రెస్ ఎన్ని పోస్టర్లు పెట్టుకున్నా ఒరిగేదేమీ లేదన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీల కంటే తక్కువ ఓట్లు కాంగ్రెస్‌కు ఉన్నాయని, అఖిలేశ్ యాదవ్ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటారని అన్నారు. 'కాంగ్రెస్, బీజేపీ దొందు దొందే అని సమాజ్‌వాదీలు చాలా కాలంగా చెబుతున్నారు' అని వ్యాఖ్యానించారు. ఏదేని పార్టీ తమ మనోభావాలకు అనుగుణంగా పోస్టర్లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. ఈ బ్యానర్లపై బీజేపీ వ్యంగ్యంగా స్పందిస్తూ యాదవ్ సహచరులవి 'ముంగేరీ లాల్ కే హసీన్ సప్నే' (పగటి కలలు) అని ఎద్దేవా చేసింది. తమ కలల కోసం ఇండియా భాగస్వాములపై ఒత్తిడి తెస్తోందని ఎస్పీని విమర్శించింది.

లంక చేతిలో ఇంగ్లాండ్ చిత్తు

బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లాండ్‌కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. టైటిల్ హాట్ ఫేవరేట్‌గా అడుగు పెట్టిన ఆ జట్టు తాజాగా శ్రీలంక చేతిలో ఘోర పరాజయాన్ని మూట కట్టుకుని సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. గురువారం ఇక్కడి చిన్నస్వామి స్టేడియంలో శ్రీలంకతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఘోర పరాజయాన్ని మూట కట్టుకుంది. లంకేయుల ధాటికి ఇంగ్లాండ్ 156 పరుగులకే కుప్పకూలగా... స్వల్ప లక్ష్యాన్ని శ్రీలంక జట్టు 25.4 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం అందుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టును శ్రీలంక బౌలర్లు వణికించారు. వీరి దెబ్బకు ఇంగ్లీష్ జట్టు 33.2 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌట్ అయింది. బెన్ స్టోక్స్ (43), జానీ బెయిర్‌స్టో (30), డేవిడ్ మలన్ (28)లు ధాటిగా ఆడినా ఆ జోరు కొనసాగించలేకపోయారు. కీలక ఆటగాళ్లయిన జో రూట్ (3), జోస్ బట్లర్ (8), లియామ్ లివింగ్ స్టోన్ (1), మొయిన్ అలీ (15), క్రిస్ వోక్స్ (0), ఆదిల్ రషీద్ (2), మార్క్ వుడ్ (5), డేవిడ్ విల్లీ (14)లు దారుణంగా విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో లాహిరు కుమార 3, ఏంజెలో మాథ్యూస్ 2, కాసున్ రజిత 2, మహీశ్ తీక్షణ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంకకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. కుశాల్ పెరీరా (4), కుశాల్ మెండిస్ (11) వెంట వెంటనే ఔట్ అయ్యారు. ఈ దశలో పాథుమ్ నిశాంక (77), సదీర విక్రమార్క (65)లు చివరి వరకు క్రీజులో వుండి జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఇంగ్లాండ్ బౌలర్లలో డేవిడ్ విల్లీకి రెండు వికెట్లు దక్కాయి. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మూడు వికెట్లు పడగొట్టిన లంక బౌలర్ లాహిరు కుమార ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ తన తదుపరి మ్యాచ్‌లో టీమిండియాతో తలపడనుంది. వరుస విజయాలతో మంచి జోరు మీదున్న రోహిత్ సేనను ఓడించడం అంత సులభం కాదు. ఆ వెంటనే ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్‌తో ఇంగ్లాండ్ ఆడాల్సి ఉంది.

రుణ రికవరీకి ఆర్బీఐ నిబంధనలు కఠినతరం

ముంబై: రుణ బకాయిల వసూలుకు సంబంధించి భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) కఠిన నిబంధనలను ప్రతిపాదిస్తోంది. రుణ వసూలులో నియంత్రిత సంస్థలు గానీ, రికవరీ ఏజెంట్లు గానీ వ్యక్తులను భౌతికంగా, మౌఖికంగా బెదిరించడం, వేధించడం వంటి చేయకూడదని స్పష్టంచేసింది. అలాగే రుణ సంస్థగానీ, వాటి ఏజెంట్లుగానీ ఉదయం 8 లోపు, సాయంత్రం 7 గంటల తర్వాత ఎవరికి ఫోన్ చేయరాదని పేర్కొంది. బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థలు.. విధాన రూపకల్పన, కేవైసీ నిబంధనలు నిర్ణయించడం, రుణాల మంజూరుకు సంబంధించిన ప్రధాన మేనేజ్‌మెంట్ విధులను ఔట్‌సోర్స్ చేయరాదని సూచించింది. ఈమేరకు ఆర్థిక సేవల్లో ఔట్ సోర్సింగ్, ప్రవర్తనా నియమావళికి సంబంధించి ముసాయిదాను ఆర్బీఐ విడుదల చేసింది. డైరెక్ట్ సేల్స్ ఏజెంట్లు, డైరెక్ట్ మార్కెటింగ్ ఏజెంట్లు, రికవరీ ఏజెంట్లకు సంబంధించి నియంత్రిత సంస్థలు బోర్డు ఆమోదించిన ప్రవర్తనా నియామావళిని అమలు చేయాలని పేర్కొంది. కస్టమర్లతో మాట్లాడే విషయంలో ఏజెంట్లకు తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపింది. కస్టమర్లకు కాల్ చేసే సమయాలు నిర్దేశించింది. ప్రైవసీ, ప్రొడక్ట్ నిబంధనలు, షరతులు వినియోగదారులకు అర్థమయ్యేలా చెప్పాలని వెల్లడించింది. రుణ గ్రహీతలకు గానీ, హామీదారులకు గానీ, వారి కుటుంబ సభ్యుల గోప్యతకు భంగం కలిగించరాదని, నలుగురిలో అవమానించరాదని ఆర్బీఐ స్పష్టంచేసింది. దీనిపై నవంబరు 28 వరకు భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయాలను రిజర్వు బ్యాంకు స్వీకరించనుంది.

వారానికి 70 గంటల పనితోనే అభివృద్ధి: నారాయణ మూర్తి

బెంగళూరు: భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అన్నారు. అలా పనిచేసినప్పుడే అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలవలగలదన్నారు. ఈ మేరకు 3వన్4 క్యాపిటల్ తొలి పాడ్‌కాస్ట్ 'ది రికార్డ్' అనే ఎపిసోడ్‌లో ఆయన దేశ నిర్మాణం, టెక్నాలజీ, ఇన్ఫోసిస్ సహా పలు అంశాల గురించి మాట్లాడారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే దేశంలో ఉత్పాదకత తక్కువని నారాయణ మూర్తి అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో చైనా వంటి దేశాలతో పోటీపడాలంటే భారత యువత కూడా అదే తరహాలో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఉత్పాదకత పెరగకుండా.. అవినీతిని తగ్గించకుండా.. అధికార నిర్ణయాల్లో జాప్యం తొలగకుండా.. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడలేమని స్పష్టంచేశారు. ఇది మీ దేశం దీని కోసం వారానికి 70 గంటలు కష్టపడతామని ప్రతిజ్ఞ చేయాలని యువతకు నారాయణమూర్తి పిలుపునిచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.